# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

RNI - TELTEL/2023/87644

**నీలగిరి నిత్యపద్యం**

ఆటవెలది

అమ్మకోపమున్ను, నాన్న యావేశంబు,
గురువు నాగ్రహంబు, కూర్మి యలక
కీడు జేయబోవు కించిత్తుగూడను
సంచితముగ నవియు మంచి నొసగు

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి

**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.

సంచిక : 9 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | మంగళవారం | 12-05-2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00



## ప్లే ఆఫ్స్ రేసులోకి
# దూసుకొచ్చిన ఢిల్లీ క్యాపిటల్స్!

- పంజాబ్‌పై 3 వికెట్ల తేడాతో డీసీ విజయం
- 211 పరుగుల లక్ష్యాన్ని 19 ఓవర్లలో ఛేజ్
- అక్షర్ పటేల్.. కెప్టెన్ ఇన్నింగ్స్..
- వరుసగా నాలుగో ఓటమి చవిచూసిన పంజాబ్

న్యూఢిల్లీ మే 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఐపీఎల్ 2026లో వరుస విజయాలతో ప్లే ఆఫ్స్ దిశగా అడుగులు వేసిన పంజాబ్ కింగ్స్.. వరుసగా నాలుగో మ్యాచులో పరాజయం పాలైంది. సోమవారం ధర్మశాల వేదికగా ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచులో 3 వికెట్ల తేడాతో ఓటమి చవిచూసింది. ఓడినా పాయింట్స్ టేబుల్‌లో మాత్రం టాప్-4లోనే

-మిగతా 2 లో



## బెంగాల్‌నూతన ప్రభుత్వం
# కీలక నిర్ణయం

- సరిహద్దుల్లో కంచె ఏర్పాటుకు అంగీకారం
- ఉద్యోగుల పదవీవిరమణ వయసు పెంపు
- మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం

కోల్‌కతా,
పశ్చిమ బెంగాల్‌లో ఏర్పాటైన నూతన ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. భారత్- బంగ్లాదేశ్ సరిహద్దుల్లో కంచె నిర్మాణం కోసం బీఎస్ఎఫ్‌కు భూమిని కేటాయిస్తూ తొలి మంత్రివర్గ సమావేశంలోనే నిర్ణయం తీసుకుంది. దీనిపై ముఖ్యమంత్రి సువేందు అధికారి మాట్లాడుతూ.. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లుగానే బంగ్లాదేశ్ వెంబడి ఉన్న సరిహద్దుల్లో కంచె నిర్మాణానికి బీఎస్ఎఫ్‌కు భూమిని బదిలీ చేశామన్నారు. మరో 45రోజుల్లో ఈ పక్రియ

-మిగతా 2 లో

## దేశానికే ఆదర్శంగా తెలంగాణ
# విద్యావిధానం

**విద్యార్థులకు రూ.వెయ్యి కోట్లతో 9 రకాల వస్తువులతో ఎడ్యుకేషన్ కిట్**

- నాణ్యత లేకుంటే ఆ కంపెనీలను బ్లాక్ లిస్టులో పెట్టి బొక్కలో వేస్తాం
- ఉత్తమ టీచర్లకు జూన్ 2న, డిసెంబర్ 9న సన్మానం
- ఏటా 500 మంది ఉపాధ్యాయులను విదేశాలకు పంపిస్తాం
- విద్యా వారోత్సవాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- క్యూర్ పరిధిలో రూ.1700 కోట్లతో విద్యాసంస్థల్లో మౌలిక వసతుల అభివృద్ధి

హైదరాబాద్ మే 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): తెలంగాణ విద్యావిధానాన్ని దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్ది ముందుకు సాగుదామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో నర్సరీ నుంచి 12వ తరగతి వరకు ప్రవేశపెట్టబోతున్నామని స్పష్టం చేశారు. టెన్త్ తర్వాత విద్యార్థులు డ్రాపౌట్ అవుతున్నారనీ, దాన్ని తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నామని వివరించారు. సోమవారం హైదరాబాద్‌లోనీ ఎల్బీ స్టేడియంలో విద్యా వారోత్సవాలను సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించారు. అందులో భాగంగా ఔటర్ రింగ్ రోడ్ లోపల క్యూర్ పరిధిలోని విద్యా సంస్థల్లో రూ.1700 కోట్లతో మౌలిక వసతుల అభివృద్ధి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూవిద్యాసంస్థలు, యూనివర్సిటీలు విద్యను నిర్లక్ష్యం చేస్తే తెలంగాణ సమాజం

-మిగతా 2 లో





## జవాబుదారీదనం లేని ప్రధాని ప్రసంగం

- ఇలాంటి వారు దేశాన్ని నడపడం కష్టం
- ప్రజలు ఏం కొనాలో.. ఏం కొనకూడదో చెప్పే పరిస్థితికి మోదీ వచ్చారు
- ఎక్స్ వేదికగా రాహుల్ విమర్శలు

2 లో



## సర్‌తో ఫలితాలు
# తారుమారు!

- 31 స్థానాల్లో బీజేపీ మెజారిటీ కన్నా సర్‌లో తొలగించిన ఓట్లే ఎక్కువ
- సుప్రీంకోర్టుకు తెలిపిన తృణమూల్
- దీనిపై కొత్తగా పిటిషన్లు దాఖలు చేయొచ్చని కోర్టు సూచన

2 లో



## బండి భగీరథ్ కేసుపై
# సిట్ ఏర్పాటు

- తెలంగాణ రాజకీయాల్లో సంచలనం రేపిన కేసు
- సమగ్రంగా విచారించేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు
- తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ ఆదేశాలు

హైదరాబాద్ మే 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): తెలంగాణ రాజకీయాల్లో సంచలనం రేపిన కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడి కేసులో ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ఈ కేసును సమగ్రంగా విచారించేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేస్తూ తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ కేసు ప్రస్తుతం రాజకీయ, సామాజిక వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ కేసు సున్నితమైనది కావడంతో దర్యాప్తును మహిళా ఐపీఎస్ అధికారిణి పర్యవేక్షణలో కొనసాగించాలని డీజీపీ నిర్ణయించారు.

-మిగతా 2 లో

# విచారణకు సహకరించండి




- దోషులు ఎవరైనా చట్టం ముందు తప్పించుకోలేరు
- బీసీ అంశాన్ని రాజకీయంగా వాడుకోవడం సరికాదు
- తెలంగాణ ఆడబిడ్డలకు ప్రభుత్వం అండగా ఉంటుంది
- బండి సంజయ్ కుమారుడి వ్యవహారంపై మంత్రి పొన్నం ప్రభాకర్

2

## సాధారణ జవాన్లతో
# అగ్నివీర్లు సమానం కాదు

- ఒకే విధమైన 'డెత్ బెనిఫిట్స్' రావు: కేంద్రం



న్యూఢిల్లీ: అగ్నివీర్లు.. సాధారణ సైనికులతో సమానం కాదని, ఇద్దరికీ ఒకే విధమైన 'డెత్ బెనిఫిట్స్' ఉండవని కేంద్రం స్పష్టం చేసింది. పాకిస్థాన్ కాల్పుల్లో మరణించిన అగ్నివీర్ తల్లి దాఖలు చేసిన పిటిషన్‌పై కేంద్రం అఫిడవిట్ దాఖలు చేయగా, పై విషయాన్ని దాంట్లో పేర్కొన్నది. సాయు ధ దళాల్లో 'అమరవీరుడు' అనే పదాన్ని ఉపయోగించరని కూడా కేంద్రం తెలిపింది.

-మిగతా 2 లో



## అన్నాడీఎంకేలో
# అసమ్మతి చిచ్చు!


- ఈపీఎస్ రాజీనామాకు వైరి వర్గం డిమాండ్

చెన్నై మే 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ఏఐఏడీఎంకే ఘోర పరాజయం నేపథ్యంలో ఆ పార్టీలో కొత్తగా అసమ్మతి సంకేతాలు వెలువడ్డాయి. పార్టీ అధినేత ఎడప్పాడి కే పళనిస్వామి రాజీనామా చేయాలని కొందరు ఎమ్మెల్యేలు డిమాండ్ చేస్తున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. పార్టీలోని కొన్ని వర్గాల నుంచి ఒత్తిడి పెరుగుతున్నప్పటికీ రాజీనామా చేయడానికి ఈపీఎస్ సుముఖంగా లేరని ఆ వర్గాలు తెలిపాయి.పార్టీ ఉన్నత వర్గాల సమాచారం ప్రకారం సీనియర్ పార్టీ నాయకుడు సీవీ షణ్ముగంతో విధేయంగా ఉన్న ఎమ్మెల్యేలు పలువురు

-మిగతా 2 లో

## ఎవరి ఒత్తిళ్లు,
# ఆంక్షలకు తలొగ్గం

**అణు పరీక్షల ద్వారా ఇప్పటికే భారత్ సత్తా చాటాం**




- చంద్రయాన్ ప్రాజెక్టులో రోవర్ దిగేచోటును శివశక్తి పాయింట్ అని పేరు పెట్టాం
- 75 ఏళ్ల సోమనాథ్ మహాదేవ్ ఆలయ పునర్నిర్మాణంపై 'అమృత్ మహోత్సవం'
- స్మారక నాణెం విడుదల చేసిన ప్రధాని

న్యూఢిల్లీ: మే 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ప్రపంచంలోని ఎవరి ఒత్తిళ్లు, ఆంక్షలకు భారత్ తలొగ్గదని నిరూపించామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. అటల్ నేతృత్వంలో భారత్ సత్తా అంటే ప్రపంచానికి ఏమిటో చూపించామని గుర్తు చేశారు. గుజరాత్‌లోని పవిత్ర పుణ్యక్షేత్రమైన సోమనాథ్ మహాదేవ్ ఆలయ పునర్నిర్మాణం జరిగి 75 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా నిర్వహిస్తున్న వేడుకల్లో ప్రధాని మోదీ పాల్గొన్నారు. వేదికపై నుంచి 75 ఏళ్ల పునర్నిర్మాణానికి గుర్తుగా ప్రత్యేక పోస్టల్ స్టాంపుతో పాటు 75 రూపాయల స్మారక నాణేన్ని ప్రధాని విడుదల చేశారు.

-మిగతా 2 లో

## కార్మికుల సంక్షేమమే
# ప్రజాపాలన లక్ష్యం

- వివిధ రంగాల్లో వారి స్థితిగతులను మెరుగు పరుస్తాం
- వారి జీవన ప్రమాణాలను మరింతగా పెంచుతాం
- కనీస వేతనాల సవరణపై కేబినెట్ సబ్ కమిటీ భేటీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



హైదరాబాద్ మే 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): తెలంగాణ రాష్ట్రంలోని వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల స్థితిగతులను మెరుగు పరిచేందుకు, వారికి మెరుగైన జీవన ప్రమాణాలను కల్పించేందుకు ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో కనీస వేతనాల సవరణపై కేబినెట్ సబ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు గడ్డం వివేక్ వెంకటస్వామి, పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాజ్యసభ సభ్యులు

-మిగతా 2 లో

# ప్లే ఆఫ్స్ రేసులోకి దూసుకొచ్చిన ఢిల్లీ క్యాపిటల్స్!

మొదటి తరువాయి

కొనసాగుతోంది. మరోవైపు టోర్నీలో ఐదో విజయంతో ఢిల్లీ క్యాపిటల్స్ పాయింట్స్ టేబుల్‌లో ఏడో ప్లేసుకు చేరుకుంది. ప్లే ఆఫ్స్ అవకాశాలను సజీవంగా ఉంచుకుంది.ఈ మ్యాచులో తొలుత బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్.. నిర్ణీత 20 ఓవర్లలో 210/5 పరుగులు చేసింది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (59), ప్రియాన్ష్ ఆర్యా (56) హాఫ్ సెంచరీలు సాధించారు. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ అనూహ్య విజయం అందుకుంది. టాప్ ఆర్డర్ బ్యాటర్లు విఫలమైనా.. మిగతా వారంతా తలా ఓ చేయి వేయడంతో విజయం సాధించింది.ఈ సీజన్‌లో ఇప్పటివరకు చెప్పుకోదగ్గ ప్రదర్శన చేయని కెప్టెన్ అక్షర్ పటేల్.. ఈ మ్యాచులో రాణించాడు. 30 బంతుల్లో 56 పరుగులు స్కోరు చేశాడు. డేవిడ్ మిల్లర్ సైతం 28 బంతుల్లో 51 రన్స్ చేసి.. డీసీని విజయం దిశగా తీసుకెళ్లాడు. అశుతోష్ శర్మ (10 బంతుల్లో 24 రన్స్), మాధవ్ తివారీ (8 బంతుల్లో 18 రన్స్ నాటౌట్), అకబ్ నబీ (2 బంతుల్లో 10 రన్స్) బ్యాట్ ఝుళిపించడంతో డీసీ సరిగ్గా 19 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేజ్ చేసింది.ఈ విజయంతో మిణుకుమిణుకు మంటున్న ప్లే ఆఫ్స్ ఆశలను డీసీ సజీవంగా ఉంచుకుంది. డీసీ మిగిలిన రెండు మ్యాచులలో గెలిస్తే ఆ జట్టు ఖాతాలో 14 పాయింట్లు చేరనున్నాయి. అప్పుడు నెట్ రన్ రేట్ ఆధారంగా డీసీ ముందంజ వేసే అవకాశం ఉంది. మరోవైపు పంజాబ్ కింగ్స్.. ప్లే ఆఫ్స్‌కు ముందు అనూహ్యంగా తడబడుతోంది. తొలి ఏడు మ్యాచులలో పరాజయం ఎరుగని ఆ జట్టు.. ఆ తర్వాత వరుసగా నాలుగింట్లో ఓడిపోయింది. అయినా 13 పాయింట్లతో టేబుల్‌లో నాలుగో ప్లేసులో ఉంది.

# బెంగాల్‌నూతన ప్రభుత్వం కీలక నిర్ణయం

మొదటి తరువాయి

పూర్తవుతుందన్నారు. కేంద్రం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆయుష్మాన్ భారత్' పథకంతో పాటు ఇతర పథకాలనూ రాష్ట్రంలో అమలు చేయనున్నట్లు ప్రకటించారు. బెంగాల్లో తాము అమలు చేయనున్న అనేక సంక్షేమ పథకాలను సువేందు అధికారి నేతృత్వంలోని కొత్త ప్రభుత్వం వెల్లడించింది. అందులో జూన్ 1నుంచి రాష్ట్రంలోని మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ల్పించనున్నట్లు ప్రకటించింది. దీనివల్ల ప్రజా రవాణాపై ఆధారపడే లక్షలాదిమంది మహిళా ఉద్యోగులు, విద్యార్థినులు ప్రయోజనం పొందుతారని అధికారులు పేర్కొన్నారు. పెరుగుతున్న జీవన వ్యయాల నేపథ్యంలో కుటుంబాలపై ఆర్థిక భారాన్ని తగ్గించే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. జూన్ 1నుంచి ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమా పథకాన్ని అమలు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఆయుష్మాన్ భారత్ పథకం ప్రారంభమైనప్పటికీ.. రాష్ట్రంలో ప్రస్తుతం అమల్లో ఉన్న సామాజిక సంక్షేమ పథకాలూ కొనసాగుతాయని స్పష్టం చేశారు. పాఠశాలల్లో ఉద్యోగాల భర్తీకి వయో పరిమితిని ఐదేళ్లు పొడిగించే ప్రతిపాదనకు క్యాబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. ఎన్నికల ప్రచార సమయంలో హామీ ఇచ్చిన విధంగా ఇతర పథకాలనూ త్వరలో ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఎన్నికల ప్రచార సమయంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా హామీ ఇచ్చినట్లుగా.. పాఠశాలల్లో ఉద్యోగాల భర్తీకి వయో పరిమితిని ఐదేళ్లు పొడిగించే ప్రతిపాదనకు కూడా క్యాబినెట్ ఆమోదం తెలిపిందని సువేందు పేర్కొన్నారు. హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ జారీ చేసిన జూన్ 2025 జనగణన సర్క్యులర్‌ను గత ప్రభుత్వం విస్మరించిందని.. దానిని తక్షణమే అమలు చేసేలా మంత్రివర్గం నిర్ణయం తీసుకుందన్నారు.

# బండి భగీరథ్ కేసుపై సిట్ ఏర్పాటు

మొదటి తరువాయి

బాధితురాలు బాలిక కావడం, ఈ కేసులో ఉన్న ఆరోపణల తీవ్రత దృష్ట్యా విచారణలో ఎలాంటి లోపాలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సిట్ బృందం ఇప్పటికే కేసుకు సంబంధించిన ఆధారాలను సేకరించే పనిని ప్రారంభించినట్లు సమాచారం. పోలీసులు బాలిక స్టేట్మెంట్ను చట్టపరమైన నిబంధనల ప్రకారం రికార్డ్ చేశారు. ఈ ప్రకటన ఆధారంగా మరిన్ని అంశాలను వెలికి తీసేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. విచారణలో భాగంగా సీసీటీవీ ఫుటేజీలు, కాల్ డేటా, డిజిటల్ ఆధారాలు కూడా పరిశీలించే అవకాశముంది.

పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు

ఈ ఘటనపై హైదరాబాద్ పరిధిలోని పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్లో భగీరథ్పై కేసు నమోదు చేశారు. బాలిక ఫిర్యాదు, ప్రాథమిక ఆధారాల ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసు వెలుగులోకి వచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ ప్రకంపనలు మొదలయ్యాయి. పోలీసులు పోక్సో చట్టం సహా పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు సమాచారం. బాలికకు సంబంధించిన కేసు కావడంతో చట్టపరమైన ప్రక్రియలను అత్యంత జాగ్రత్తగా అమలు చేస్తున్నారు.

## సాధారణ జవాన్లతో
# అగ్నివీర్లు సమానం కాదు

మొదటి తరువాయి

వారి కుటుంబ సభ్యులకు అందే పెన్షన్ ప్రయోజనాల విషయంలో సాధారణ సైనికులతో సమానంగా అగ్నివీర్లకు బెనిఫిట్స్ ఉండవని కేంద్రం బాంబే హైకోర్టుకు తెలియజేసింది.గత ఏడాది 'ఆపరేషన్ సిందూర్'లో పాకిస్థాన్ సైన్యం జరిపిన మోర్టార్ దాడుల్లో పూంచ్‌లో మురళీ నాయక్ అనే అగ్నివీర్ వీరమరణం పొందాడు. స్వల్పకాలిక నియామక పథకం కింద చేరిన 'అగ్నివీర్ల' కుటుంబాలకు దీర్ఘకాలిక పెన్షన్, ఇతర సంక్షేమ ప్రయోజనాల్ని కేంద్రం నిరాకరిస్తున్నదని మురళీ నాయక్ తల్లి కోర్టును ఆశ్రయించింది.

# అన్నాడీఎంకేలో అసమ్మతి చిచ్చు!

మొదటి తరువాయి

మాజీ మంత్రులతో కలసి వరుసగా నాలుగు ఎన్నికల ఓటముల తర్వాత ఆయన నాయకత్వాన్ని ఇకపై అంగీకరించడానికి సిద్ధంగా లేమని ఈపీఎస్‌కు తెలియచేశారు. ఏప్రిల్ 23న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే 234 స్థానాలకు గాను కేవలం 47 స్థానాలను గెలుచుకుంది.

# కార్మికుల సంక్షేమమే ప్రజాపాలన లక్ష్యం

మొదటి తరువాయి

వేం నరేందర్ రెడ్డి, లేబర్ కమిషనర్ దాసరి హరి చందన, ఫైనాన్స్ అండ్ ప్లానింగ్ సెక్రటరీ గౌరవ్ ఉప్పల్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. తెలంగాణలో వేతనాల సవరణ శాస్త్రీయంగా ఉండాలని ప్రభుత్వం భావిస్తోందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ఈ సందర్భంగా దేశంలోని ఇతర ప్రధాన రాష్ట్రాల్లో అమలవుతున్న కనీస వేతనాల విధానాలను కమిటీ కూలంకషంగా పరిశీలించింది. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా తీసుకురానున్న నూతన 'లేబర్ కోడ్' అంశాల ప్రభావం ఎలా ఉండబోతోందనే దానిపై సుదీర్ఘంగా చర్చించారు. కార్మికుల వేతనాలను కేవలం అంకెల్లో కాకుండా, వారి వాస్తవ అవసరాలకు అనుగుణంగా సవరించాలని కమిటీ నిర్ణయించింది. ప్రస్తుతం పెరుగుతున్న ధరలు, జీవన వ్యయానికి అనుగుణంగా వేతనాలు ఉండాలని కేబినెట్ సబ్ కమిటీ నిర్ణయించింది. దేశంలోని అత్యుత్తమ వేతన నమూనాలను తెలంగాణలో అమలు చేయాలని ప్రభుత్వం దృఢ సంకల్పంతో ఉందని కేబినెట్ సబ్ కమిటీ అభిప్రాయ పడింది. తెలంగాణను కార్మికుల పక్షపాతి రాష్ట్రంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఉప ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. త్వరలోనే అన్ని వర్గాల అభిప్రాయాలను క్రోడీకరించి, కార్మికులకు మేలు చేకూర్చే విధంగా కనీస వేతనాల సవరణపై తుది నిర్ణయం తీసుకోనున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది అసంఘటిత, సంఘటిత రంగ కార్మికులకు లబ్ధి చేకూరేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు.

# దేశానికే ఆదర్శంగా తెలంగాణ విద్యావిధానం

మొదటి తరువాయి

బలహీనపడుతుందని వివరించారు. పేదలకు న్యాయమైన విద్య, సాంకేతిక నైపుణ్యాన్ని అందించడం ప్రభుత్వ బాధ్యత అని చెప్పారు. రాష్ట్రంలోని తండాలు, గూడేలు, మారు ముల గ్రామాల్లోని పేదలు, దళితులు, గిరిజనులకు నాణ్యమైన విద్యను అందించాలని విద్యాశాఖను తన దగ్గర ఉంచుకున్నానని అన్నారు. 27 వేల ప్రభుత్వ పాఠశాలల్లో 19 లక్షల విద్యార్థులు చదువుకుంటున్నారని చెప్పారు.

1.5 లక్షల మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని చెప్పారు.12 వేల ప్రయివేటు స్కూళ్లలో 38 లక్షల మంది చదువుతున్నారని వివరించారు.ప్రయివేట్ స్కూళ్లలో ఉన్న గొప్పతనం ఏమిటీ, ప్రభుత్వ స్కూళ్లలో ఉన్న లోపం ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్ర బడ్జెట్లో విద్యాశాఖకు ఎనిమిది శాతం నిధులను కేటాయించామన్నారు. దశల వారీగా విద్యకు 15 శాతం నిధులను కేటాయించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రభుత్వ విద్యలో తెలంగాణను దేశంలోనే నెంబర్ వన్ గా నిలబెట్టడమే లక్ష్యమని ప్రకటించారు.దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే ఉందని అన్నారు.25 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులను విద్యా విధానం పరిశీలనకు ఫిన్లాండ్‌కు పంపించామని వివరించారు.అత్యుత్తమ ప్రదర్శన కనపర్చిన ఉపాధ్యాయులను ఎంపిక చేసి 500 మందిని విదేశాలకు పంపిస్తామన్నారు.విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాలను గుర్తించే టీచర్లను అభినందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదని అన్నారు.రాష్ట్ర అవతరణ దినోత్సవం జూన్ రెండున, తెలంగాణ తల్లి జన్మదినం డిసెంబర్ తొమ్మిదిన ఉత్తమ టీచర్లకు సన్మానం చేస్తామని వివరించారు. పేద విద్యార్థులు ఆర్థాకలితో పాఠశాలలకు వస్తున్నారనీ,ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన భోజనం అందిస్తామని చెప్పారు.పాఠశాల విద్యార్థులకు పాలు, రాగిజావ అందిస్తామన్నారు.కొడంగల్‌లో పైలట్ ప్రాజెక్టుగా పాఠశాలల్లో బ్రేక్ ఫాస్ట్ అద్భుతంగా అందిస్తున్నామని అన్నారు.

ప్రభుత్వం పాఠశాల్లో చదవే విద్యార్థులు తమ పిల్లలతో సమానమని చెప్పారు.తల్లిదండ్రుల్లా తమ ప్రభుత్వం విద్యార్థులను జాగ్రత్తగా చూసుకుంటుందని వివరించారు. విద్యాశాఖపైన పెట్టే ఖర్చును భవిష్యత్తు తరాల పెట్టుబడిగా భావిస్తున్నామని చెప్పారు.100 నియోజకవర్గాల్లో 100 యంగ్ ఇండియా ఇంటిగ్రేటేడ్ స్కూళ్లను రూ.200 కోట్లతో నిర్మిస్తున్నామని వివరించారు. పేద బిడ్డలు ధైర్యంగా వాటిలో చదువుకున్నామని చెప్పాలన్నదే తన ధ్యేయమని చెప్పారు.పాఠశాలలు టీచర్లు, ఐఏఎస్‌లు, రాజకీయ నాయకుల కోసం కాదనీ, పేద విద్యార్థుల కోసం, వారి సంక్ష??అమం కోసమని అన్నారు.ఏ నిర్ణయమైనా వెనకడుగు వేయకుండా తీసుకుంటామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ఇచ్చే ఎడ్యూకేషన్ కిట్ నాణ్యతను తాను స్వయంగా పరిశీలించానని అన్నారు. ఎడ్యూకేషన్ కిట్ కోసం రూ.వెయ్యి కోట్లు ఖర్చు చేస్తున్నామని వివరించారు.నాణ్యమైన వస్తువులు రాకపోతే తక్షణమే ప్రజా ప్రతినిధుల దృష్టికి తేవాలని సూచించారు. నాణ్యత లేని వస్తువులను సరఫరా చేస్తే కంపెనీలను బ్లాక్ లిస్టులో చేరుస్తామనీ, వారిని బొక్కలో వేయించే బాధ్యత తాను తీసుకుంటానని చెప్పారు. పుస్తకాలు, నోట్ పుస్తకాలు సరైన సమయంలో విద్యార్థులకు చేరాలన్నారు.పాఠశాల ప్రారంభమయ్యే రోజే విద్యార్థులకు ఒక జత బట్టలు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. మరో జత నెలాఖారున ఇవ్వాలని చెప్పారు. భవిష్యత్తులో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకూ నూటికి నూరు శాతం మార్కులు రావాలన్నదే తన స్వప్నమని అన్నారు.టీచర్లకు మొదటి తారీఖున జీతంతో పాటు మౌలిక సదుపాయలు కల్పించే బాధ్యత తనదని చెప్పారు.

ప్రభుత్వ టీచర్లది ఉద్యోగం కాదనీ, భావోద్వేగమనీ, అది బరువు కాదనీ బాధ్యత అని అన్నారు.19 లక్షల మంది విద్యార్థుల కుటుంబాల భవిష్యత్తు ప్రభుత్వ ఉపాధ్యాయుల చేతిలో ఉందన్నారు.పేద విద్యార్థులు, వారి తల్లిదండ్రుల కండ్లలో ఆనందం చూడాలంటే టీచర్లు ఒక గంట అదనంగా పని చేయాలని కోరారు.విద్యాశాఖకు మంత్రి లేరని కొందరు మాట్లాడుతున్నారనీ, సమీక్ష సమయంలో తనను ముఖ్యమంత్రిగా కాకుండా విద్యా శాఖ మంత్రిగా చూడాలని కోరారు. మంచి విద్యను అందించాలనీ, ఉత్తమ పౌరులను తయారు చేయాలని సూచించారు. త్వరలోనే విద్యా శాఖలో మరిన్ని మంచి నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రులు డి శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, అజహరుద్దీన్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, గడ్డం వివేక్ వెంకటస్వామి, సలహాదారులు కె కేశవరావు, హార్కర వేణుగోపాల్, విహెచ్, ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ పి శ్రీపాల్‌రెడ్డి, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, నవీన్ యాదవ్, విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా, పాఠశాల విద్యాశాఖ సంచాలకులు నవీన్ నికోలస్ తదితరులు పాల్గొన్నారు .

# సర్‌తో ఫలితాలు తారుమారు!

-31 స్థానాల్లో బీజేపీ మెజారిటీ కన్నా సర్‌లో తొలగించిన ఓట్లే ఎక్కువ
-సుప్రీంకోర్టుకు తెలిపిన తృణమూల్
-దీనిపై కొత్తగా పిటిషన్లు దాఖలు చేయొచ్చని కోర్టు సూచన

**కోల్‌కతా**




పశ్చిమ బెంగాల్‌లో 'సర్' ప్రక్రియ.. బీజేపీ ఎన్నికల విజయానికి దోహదపడిందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 31 స్థానాల్లో బీజేపీ సాధించిన ఓట్ల మెజారిటీ కన్నా..'సర్' పేరుతో తొలగించినవే ఎక్కువగా ఉన్నాయని తాజాగా గణాంకాలు బయటకు వచ్చాయి. బెంగాల్ వ్యాప్తంగా కేంద్రం చేపట్టిన 'సర్' ప్రక్రియ ఎన్నికల ఫలితాల్నే తారుమారు చేసిందని మాజీ సీఎం, తృణమూల్ నాయకురాలు మమతా బెనర్జీ ఆరోపిస్తున్నారు. ఇందుకు సంబంధించి సుప్రీంకోర్టులో తృణమూల్ సోమవారం తన వాదనను వినిపిస్తూ, 'సర్' ఓట్ల తొలగింపు పలు నియోజకవర్గాల్లో అసెంబ్లీ ఎన్నికల్ని గణనీయంగా ప్రభావితం చేసిందని తెలిపింది.ఈ వాదనను ఈసీ వ్యతిరేకించగా, ఈ అంశంపై కొత్తగా పిటిషన్ దాఖలు చేయాలని మమతా బెనర్జీకి ధర్మాసనం సూచించింది. సోమవారం సీజేఐ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ అంశంపై విచారణ చేపట్టింది. తృణమూల్ నాయకుడు కల్యాణ్ బెనర్జీ వాదనలు వినిపిస్తూ, ఒక స్థానంలో విజేతకు లభించిన ఆధిక్యం, తొలగించిన ఓటర్ల సంఖ్య కంటే తక్కువగా ఉంటే.. ఇది న్యాయసమీక్ష అర్హమైనదిగా జస్టిస్ బాగ్చి గతంలో చేసిన వ్యాఖ్యను ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. 'చాలా చోట్ల ఓట్ల తొలగింపు.. అభ్యర్థి ఓటమికి కారణమైన ఓట్ల తేడాకు సమానంగా ఉంది. ఒక నియోజకవర్గంలో ఒక అభ్యర్థి కేవలం 862 ఓట్ల తేడాతో ఓడిపోయాడు. అక్కడ 'సర్' పేరుతో 5,432 ఓట్లను తీసేశారు. తృణమూల్, బీజేపీకి మధ్య 32 లక్షల ఓట్ల తేడా కనపడగా, అప్పిలేట్ ట్రిబ్యునల్స్‌లో 35 లక్షల అప్పీళ్లు పెండింగ్‌లో ఉన్నాయి' అని కల్యాణ్ బెనర్జీ సుప్రీం కోర్టుకు తెలియజేశారు.

# జవాబుదారీదనం లేని ప్రధాని ప్రసంగం

- ఇలాంటి వారు దేశాన్ని నడపడం కష్టం
- ప్రజలు ఏం కొనాలో.. ఏం కొనకూడదో చెప్పే పరిస్థితికి మోదీ వచ్చారు
- ఎక్స్ వేదికగా రాహుల్ విమర్శలు



**న్యూఢిల్లీ,**

కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ప్రధాని నరేంద్ర మోదీపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. మోదీ జవాబుదారీతనాన్ని కోల్పోయారని అన్నారు. ప్రజలు ఏం కొనాలో.. ఏం కొనకూడదో చెప్పే పరిస్థితికి మోదీ వచ్చారంటూ మండిపడ్డారు. తెలంగాణ సభలో మోదీ చెప్పినవి ప్రబోధాలు కావని, కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలు అని అన్నారు. రాజీపడిన ప్రధాని మోదీ.. దేశాన్ని నడపడం కష్టమన్నారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో సోమవారం ఓ పోస్టు పెట్టారు. ఆ పోస్టులో.. ప్రతిసారీ బాధ్యతను ప్రజలపైనే నెట్టేస్తున్నారని, ఆయన మాత్రం జవాబుదారీతనం నుంచి తప్పించుకు తిరుగు తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో బీజేపీ భారీ బహిరంగ సభ నిర్వహించింది. ఈ బహిరంగ సభలో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ.. పశ్చిమాసియా యుద్ధ ప్రభావం దేశంపై తీవ్రంగా ఉందని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్, గ్యాస్, యూరియా ధరలు అమాంతం పెరిగాయని తెలిపారు. రెండు నెలల నుంచి ప్రజలపై భారం పడకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని, యుద్ధం కారణంగా వచ్చే నష్టాన్ని కేంద్రమే భరిస్తోందని వెల్లడించారు. క్లిష్ట సమయంలో దేశ ప్రజలు పెట్రోల్, డీజిల్ పరిమితంగా వినియోగించాలని కోరారు. ప్రజలు ఎలక్ట్రిక్ వాహనాలను వినియోగించాలని.. వర్క్‌ఫ్రమ్ హోమ్, ఆన్‌లైన్ మీటింగ్‌లు పెట్టుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజా రవాణాను వినియోగించాలన్నారు. ఇవన్నీ కూడా ప్రజలను అప్రమత్తం చేసేవిగా లేవని రాహుల్ అన్నారు. కేవలం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నమని అన్నారు.

# ఎవరి ఒత్తిళ్లు, ఆంక్షలకు తలొగ్గం

మొదటి తరువాయి

ఆధ్యాత్మిక కార్యక్రమాల అనంతరం ప్రధాని సద్భావన మైదానంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ప్రసంగించారు. "సోమనాథ్ దేవాలయ అభివృద్ధిలో శివుడి ఆశీస్సులు ఉన్నాయి. సోమనాథ్ దేవాలయ రూపురేఖలు పూర్తిగా మారుతున్నాయి. 1951లో సోమనాథ్ దేవాలయ పునర్నిర్మాణం చేపట్టాం. భారత్ తన ప్రాచీన సంస్కృతిని, వారసత్వాన్ని కూడా పరిరక్షించుకుంటుంది. సోమనాథ్ పునర్నిర్మాణ పనుల ద్వారా దీన్ని ప్రపంచానికి చాటాం. భారత్ అంటే వేల ఏళ్ల ఆధ్యాత్మిక చైతన్యం కలిగిన దేశం. అసత్యంపై ఎప్పటికైనా సత్యమే గెలుస్తుందని మన పూర్వీకులు నిరూపించారు. 1998 మే 11న ఇదేరోజు పోఖ్రాన్ లో అణు పరీక్షలు చేపట్టాం. 1998లో అణు పరీక్షల ద్వారా భారత్ సత్తా చాటాం. అప్పటి అణుపరీక్షలు చూసి ప్రపంచ దేశాలు ఆశ్చర్యపోయాయి. అణు పరీక్షల తర్వాత అనేక ఆంక్షలు విధించి ఇబ్బంది పెట్టారు. మనం ఎవరి ఆంక్షలకు తలొగ్గలేదు ధైర్యంగా నిలబడ్డాం. 1998 మే 13న మరో రెండు అణు పరీక్షలు నిర్వహించాం. అటల్ నేతృత్వంలో భారత్ సత్తా అంటే ప్రపంచానికి ఏమిటో చూపించాం. భారత్ ఎవరి ఒత్తిళ్లు, ఆంక్షలకు తలొగ్గదని నిరూపించాం. చంద్రయాన్ ప్రాజెక్టులో రోవర్ దిగేచోటును శివశక్తి పాయింట్ అని పేరు పెట్టాం. శివుడికి, చంద్రుడికి అవినాభావ సంబంధం ఉంది. సోమనాథ్ దేవాలయ సంపదను గజనీ, ఖిల్జీ అనేకసార్లు దోచుకున్నారు. ఎన్ని సార్లు దాడులు చేసినా సోమనాథ్ దేవాలయం సగర్వంగా నిలబడింది. భారత్ ఆధ్యాత్మిక శక్తి గురించి విధ్వంసకారులకు తెలియదు." అని ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. సోమనాథ్ ఆలయంలో నిర్వహిస్తున్న 'అమృత్ మహోత్సవంలో' ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్నారు. సోమనాథ్ ఆలయంలో ప్రధాని ప్రత్యేక పూజలు నిర్వహించారు. 'అభిషేకం', 'ధ్వజ పూజ'తో పాటు 'మహా పూజ'లో ఆయన పాల్గొన్నారు. ఈ వేడుకల్లో భాగంగా భారత వాయుసేనకు చెందిన 'సూర్యకిరణ్' టీమ్ నిర్వహించిన సాహసోపేతమైన విన్యాసాలు అబ్బురపరిచాయి. అనంతరం సోమ్ నాథ్ ఆలయ పునర్నిర్మాణానికి నాంది పలికిన సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తర్వాత ఆలయ ప్రాంగణంలో జరిగే కుంభాభిషేక క్రతువులో ప్రధాని పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్, ఉప ముఖ్యమంత్రి హర్ష్ సంఘ్వి కూడా పాల్గొన్నారు. అంతకుముందు ప్రధాని నరేంద్ర మోదీ నిర్వహించిన భారీ రోడ్‌షోకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. సోమనాథ్ వీధులు మోదీ నామస్మరణతో మారుమోగాయి. హెలిప్యాడ్ నుంచి వీర్ హమీర్జీ సర్కిల్ వరకు సుమారు ఒకటిన్నర కిలోమీటర్ల మేర సాగిన ప్రధాని రోడ్‌షోకు జనం భారీగా తరలివచ్చారు. దారిపొడవునా జాతీయ జెండాలు ఊపుతూ, నినాదాలు చేస్తూ ప్రధానికి ఘనస్వాగతం పలికారు. రోడ్‌షోలో భారతీయ సంస్కృతి ప్రతిబింబించేలా దేశంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన కళాకారులు ప్రదర్శనలు ఇచ్చారు. బెంగాల్‌కు చెందిన జానపద కళాకారులు తమ సంప్రదాయ నృత్యాలతో రోడ్‌షోలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. 1951లో భారత తొలి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ ఈ పునర్నిర్మిత ఆలయాన్ని ప్రారంభించారు. ఆ చారిత్రక ఘట్టానికి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ అమృత్ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

# విచారణకు సహకరించండి

-దోషులు ఎవరైనా చట్టం ముందు తప్పించుకోలేరు
-బీసీ అంశాన్ని రాజకీయంగా వాడుకోవడం సరికాదు
-తెలంగాణ ఆడబిడ్డలకు ప్రభుత్వం అండగా ఉంటుంది
-బండి సంజయ్ కుమారుడి వ్యవహారంపై మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్**

కేంద్ర సహాయ హోంమంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడిపై వచ్చిన ఆరోపణల విషయంలో తెలంగాణ ప్రభుత్వం ఎలాంటి కక్షపూరిత ధోరణితో వ్యవహరించడం లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులే ముందుకు వచ్చి విచారణకు సహకరించాలని, కేంద్ర మంత్రిగా ఉన్న బండి సంజయ్ స్వయంగా తన కుమారుడిపై వచ్చిన ఆరోపణలపై విచారణ జరపాలని కోరాల్సిందని అన్నారు. సానుభూతి కోసం కుట్ర ఆరోపణలు చేయడం మానుకోవాలని సూచించారు. అమ్మాయి తనను కలిసిందా లేదా, ఆమెతో బాబు తిరిగాడా



లేదా వంటి అంశాలపై నిజానిజాలు వెలుగులోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. ముందుగా తమ నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాల్సిన బాధ్యత సంబంధిత వారిపైనే ఉంటుందని వ్యాఖ్యానించారు. చట్టం తన పని తాను చేసుకునేలా సహకరించాలని, తెలంగాణ ప్రభుత్వం ఎవరి పట్ల వివక్ష చూపదని తెలిపారు. తెలంగాణ ఆడబిడ్డల భద్రత ప్రభుత్వ బాధ్యత అని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఇలాంటి ఘటనల్లో బాధితులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. మున్నూరు కాపు సంఘ నాయకులు వివక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని చెబుతున్నప్పటికీ, ఈ వ్యవహారాన్ని కులం లేదా రాజకీయ కోణంలో చూడడం సరికాదన్నారు. ఇందులో ఎవరినీ లక్ష్యంగా చేసుకుని బ్లేమ్ గేమ్ ఆడడం లేదని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా డీజీపీతో మాట్లాడి విచారణకు ఆదేశాలు ఇచ్చారని మంత్రి వెల్లడించారు. మహిళా డీసీపీ ఆధ్వర్యంలో విచారణ కొనసాగుతోందని, రాజకీయ ఒత్తిడులకు తావులేకుండా పూర్తిగా నిష్పక్షపాతంగా దర్యాప్తు జరుగుతుందని పేర్కొన్నారు. దోషులు ఎంతటి వారైనా చట్టం ముందు తప్పించుకోలేరని హెచ్చరించారు. ఇలాంటి సంఘటనలు నిజంగా జరిగి ఉంటే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం వెనకడుగు వేయదని మంత్రి స్పష్టం చేశారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని విచారణను ప్రభావితం చేయాలని ప్రయత్నిస్తే ప్రజాస్వామ్యం అంగీకరించదన్నారు.

# దేవరకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యా వారోత్సవాలు

**-ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక**
**- విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు**




**దేవరకొండ మే 11 (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
దేవరకొండ పట్టణం లోని మునగాల కొండలరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల(అటానమస్)లో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా విద్యా వారోత్సవాలు (ఎడ్యుకేషన్ వీక్) కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఏడు రోజుల ప్రణాళిక రూపొందించారు. ఏడు రోజుల ప్రణాళికలో మొదటి రోజు ప్రారంభోత్సవంలో దేవరకొండ మున్సిపల్ చైర్మన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎడ్యుకేషనల్ వీక్ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని, కళాశాల అభివృద్ధి కొరకు నా వంతుగా కృషి చేస్తానని పేర్కొన్నారు. అనంతరం కళాశాల బ్రోచర్ ను ఆవిష్కరించడం జరిగింది.
11-17 వరకు విద్యా వారోత్సవాలు విద్యా వారోత్సవాలకు సంబంధించిన డే వైస్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయడం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామావత్ రవి మాట్లాడుతూ ప్రభుత్వ ప్రవేశపెట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా "విద్యా వారోత్సవాలు" కార్యక్రమం ప్రణాళికబద్ధంగా నిర్వహిస్తామని అలాగే కళాశాల అభివృద్ధికి అన్ని విధాలుగా ప్రతి ఒక్క సిబ్బంది ఎంతగానో కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి.కోటయ్య, అకాడమిక్ కోఆర్డినేటర్ సి. లింగమయ్య, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ జి.లింగారెడ్డి, ఐక్యు.ఏ.సి కోఆర్డినేటర్ డాక్టర్ కె.పృథు, తదితర అధ్యాపకులు అధ్యాపకేతరులు పాల్గొన్నారు.

## ఎల్లంపల్లి గ్రామంలో ఎల్లమ్మ, బొడ్రాయి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం



**షాద్‌నగర్, మే 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఫరూక్‌నగర్ మండలంలోని ఎల్లంపల్లి గ్రామంలో ఎల్లమ్మ, బొడ్రాయి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "బొడ్రాయి ప్రతిష్ఠాపన గ్రామానికి దిష్టి తగలకుండా, చెడు శక్తులు ప్రవేశించకుండా రక్షణ కల్పిస్తుంది. అమ్మవారి అనుగ్రహంతో గ్రామ ప్రజలకు మంచి జరగాలి" అని ఆకాంక్షించారు. ఈ మహోత్సవంలో ఎల్లంపల్లి సర్పంచ్ భవాని సుజాత మల్లేష్, మొగిలిగిద్ద సర్పంచ్ బుగ్గ కృష్ణ, మహదేవ్‌పూర్ సర్పంచ్ అనుషా రవీందర్ రెడ్డి, ఉప సర్పంచ్ మహేష్ యాదవ్, వార్డు సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు శ్రీశైలం, శంకరయ్య గౌడ్, శివ, మల్లేష్, వేణు యాదవ్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతో మానసిక ఉల్లాసం

**- ఎస్.హెచ్.ఓ వెంకటేశ్వర్లు**
**- విటాయిపల్లిలో కౌన్సిలర్ అనిత శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో విపిఎల్ క్రికెట్ టోర్నమెంట్**




**ఆమనగల్లు, మే 11 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని ఆమనగల్లు ఎస్.హెచ్.ఓ వెంకటేశ్వర్లు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డు విఠయిపల్లిలో కౌన్సిలర్ కోగూరి అనిత శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విపిఎల్ - 2026 క్రికెట్ టోర్నమెంట్ ను సోమవారం ఎస్.హెచ్.ఓ వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చిన్నతనం నుంచే క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని పేర్కొన్నారు. ఆటల్లో గెలుపోటములు పట్టుంచుకోకుండా క్రీడా స్ఫూర్తిని చాటాలన్నారు. క్రీడల్లో ముందుకు సాగాలంటే సాధననే ముఖ్యమని తెలిపారు. కార్యక్రమంలో 1వ వార్డు కౌన్సిలర్ ధోలీ మాల్యా నాయక్, నాయకులు జెల్లల నితిన్ రెడ్డి, శ్రీధర్ నాయక్, పర్వతాలు, రవి, నర్సింహా, దావీదు, శేఖర్, జంగయ్య, వెంకటేశ్వర్లు రెడ్డి, మధుసూదన్ రెడ్డి, జగదీష్, శంకర్ నాయక్ తదితరులు ఉన్నారు.

## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న గోలీ దంపతులు



**ఆమనగల్లు, మే 11 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి, ఆయన ధర్మపత్ని సుమలతతో కలిసి సోమవారం కలియుగ దైవం తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామి వారిని దర్శించుకున్న అనంతరం గోలి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడారు.. లోకకల్యాణం కోసం, ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రం మరియు కల్వకుర్తి నియోజకవర్గం ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని స్వామి వారిని ప్రార్థించినట్లు తెలిపారు. శ్రీవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లవేళలా ఉండాలని ఆయన మనస్ఫూర్తిగా కోరుకున్నారు. దర్శనానంతరం ఆలయ పండితులు రంగనాయకుల మండపంలో వీరికి వేదాశీర్వచనం చేయగా, అధికారులు స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేశారు.

## ఎలిగేడులో విద్యా వారోత్సవాలు ప్రారంభం

**భవిత కేంద్రం ఆవిష్కరణ, దివ్యాంగుల విద్యార్థులకు ప్రత్యేక సదుపాయాలు**



భవిత కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు



భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ

**ఎలిగేడు, మే 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎలిగేడు మండలంలోని ధూళికట్ట జడ్పీహెచ్‌ఎస్, ప్రాథమిక పాఠశాలల్లో ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా విద్యా వారోత్సవాలు లాంఛనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో ఎంఈఓ నరేంద్రచారి, సర్పంచ్ కొమురయ్య, హెడ్‌మాస్టర్లు, ఉపాధ్యాయులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు. విద్యా వారోత్సవాల ప్రాముఖ్యతను వివరించిన అనంతరం భవిత సెంటర్ భవనాన్ని ప్రారంభించారు. ఎంఈఓ నరేంద్రచారి మాట్లాడుతూ, "భవిత కేంద్రంలో దివ్యాంగుల విద్యార్థులకు ఫిజియోథెరపీతో పాటు విద్య నేర్పించడం జరుగుతుంది. ఇది వారి అభ్యాసానికి, అభివృద్ధికి ఎంతో తోడ్పడుతుంది" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొమురయ్య, హెచ్‌ఎంలు బిజిలి సదయ్య, యుగేందర్, వార్డు సభ్యులు గీస బొందయ్య, బత్తిని శ్రీనివాస్, మెండె ఐలయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వెల్దండలో ఉపాధి హామీ పనుల పర్యవేక్షణ



**వెల్దండ, మే 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వెల్దండ మండలంలోని రాచూరు గ్రామ పరిధిలోని రాజోని బావికుంటలో జరుగుతున్న పూడికతీత పనులను మండల ఎంపీడీవో కృష్ణయ్య సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ప్రతిరోజు కొలతల ప్రకారం పనిచేస్తే కూలీలకు రూ. 307 వేతనం లభిస్తుంది. ఎండలు ఎక్కువగా ఉన్నందున ఉదయం 6.30 గంటల వరకు పనికి రావాలి. తగు జాగ్రత్తలు తీసుకొని పని చేయాలి" అని సూచించారు. కూలీల సౌకర్యార్థం పని ప్రదేశంలో నీడ కోసం షేడ్ ఏర్పాటు చేయాలని, త్రాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు సరిపడా అందుబాటులో ఉంచాలని పంచాయతీ కార్యదర్శికి ఆదేశించారు. కూలీల హాజరు ఖచ్చితంగా నమోదు చేయాలని మేట్‌లకు సూచించారు. అనంతరం కూలీల జాబ్ కార్డులు, హాజరు మస్టర్స్‌ను పరిశీలించారు. తరువాత నర్సరీని సందర్శించిన ఎంపీడీవో, మొలకెత్తని విత్తనాల బ్యాగుల్లో కొత్త విత్తనాలు నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీనివాస్, ఎంపీఓ లక్ష్మణ్, ఏపీఓ ఈశ్వర్, పద్మ, పంచాయతీ కార్యదర్శి క్రాంతి, ఫీల్డ్ అసిస్టెంట్, మేట్‌లు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ బీరప్ప సమేత కారమతి కళ్యాణ మహోత్సవం



**వెల్దండ, మే 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వెల్దండ మండల కేంద్రంలోని శ్రీ బీరప్ప స్వామి దేవాలయంలో నిర్వహించిన శ్రీ బీరప్ప సమేత కారమతి కళ్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ మహోత్సవానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లా డీసీసీ ఉపాధ్యక్షుడు భూపతి రెడ్డి హాజరై స్వామివారి కళ్యాణంలో పాల్గొన్నారు. అనంతరం స్వామివారి దర్శనం చేసుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, "ప్రజలంతా ఐక్యంగా నిర్వహించే ఇలాంటి కళ్యాణ మహోత్సవాలు మన సంప్రదాయాల గొప్పతనాన్ని ప్రతిబింబిస్తాయి. భక్తి, సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత. శ్రీ బీరప్ప స్వామివారి ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలి" అని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్, ఉప సర్పంచ్ శీను, కల్వకుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ సంజీవ్ కుమార్ యాదవ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హరికిషన్, దిశా కమిటీ సభ్యులు మోతిలాల్ నాయక్, ఆలయ కమిటీ సభ్యులు చిందం కృష్ణయ్య, తంబాల్, రామకృష్ణ, శ్రీశైలం, చంద్రశేఖర్, కొండల్ యాదవ్, గ్రామ వార్డు సభ్యులు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని వినతి



**మర్రిగూడ, మే 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మర్రిగూడ మండల కేంద్రంలోని ఐకెపి సెంటర్లలో ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని తాహసిల్దార్ జక్కర్తి శ్రీనివాసులకు వినతి పత్రం అందజేశారు. బీసీ సంఘం మండల అధ్యక్షుడు చెరుకు శ్రీరామ్ గౌడ్ మాట్లాడుతూ, "రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు నెలరోజులుగా ధాన్యం తీసుకొచ్చినా ఇప్పటికీ కొనుగోలు జరగకపోవడంతో ఆందోళనలో ఉన్నారు. అకాల వర్షాల వల్ల ధాన్యం తడిసి రైతులు నష్టపోతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి కొనుగోలు వేగవంతం చేయాలి" అని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్యార గోపాల్, మోదుగు రాజు, సంతోష్, సిరివేరు చిన్న రాములు, గుణగంటి వెంకటయ్య తదితర రైతులు పాల్గొన్నారు.

## బండి సంజయ్ కుమారుడిపై చర్యలు తీసుకోవాలి- విజితా రెడ్డి



**కల్వకుర్తి, మే 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కల్వకుర్తి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, తెలంగాణ ఉద్యమకారురాలు డాక్టర్ విజితా రెడ్డి బండి సంజయ్ కుమారుడు సాయి భగీరథపై నమోదైన పోక్సో కేసులో ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ బుద్ధభవన్‌లో తెలంగాణ మహిళా కమిషనరేట్ సెక్రటరీకి వినతి పత్రం అందజేసిన ఆమె మాట్లాడుతూ, "బండి సంజయ్‌ను మంత్రి పదవి నుండి తొలగించాలి. ఆయన కుమారుడిపై కేసు నమోదు అయినప్పటికీ పోలీసులు ఆలస్యం చేస్తున్నారు. బాధిత కుటుంబాన్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయి" అని ఆరోపించారు. భగీరథను వెంటనే అరెస్టు చేయాలని, కేసులో నిర్లక్ష్యం వహించిన పోలీసులను సస్పెండ్ చేయాలని విజితా రెడ్డి డిమాండ్ చేశారు. "చిన్న చిన్న కేసుల్లో వెంటనే అరెస్టులు చేస్తారు, కానీ మైనర్ బాలికపై జరిగిన దారుణంలో పోలీసులు స్పందించడం లేదు. ఇది బాధాకరం" అని ఆమె పేర్కొన్నారు. అదేవిధంగా, కాంగ్రెస్ నేతలు, మహిళా నాయకులు బాధిత కుటుంబానికి బాసటగా నిలవాలని విజితా రెడ్డి కోరారు. "కేంద్ర మంత్రి అమిత్ షా వెంటనే బండి సంజయ్‌ను మంత్రి పదవి నుండి తప్పించాలి" అని ఆమె స్పష్టం చేశారు.

## వెల్దండ కల్లు గీత సహకార సంఘ అధ్యక్షుడిగా మదన్ గౌడ్



**వెల్దండ, మే 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వెల్దండ మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయంలో కల్లు గీత సహకార సంఘ ఎన్నికలు సోమవారం నిర్వహించగా, వెల్దండ గ్రామపంచాయతీకి చెందిన మట్ట మదన్ గౌడ్ ఏకగ్రీవంగా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా మట్ట విష్ణు గౌడ్, కార్యదర్శిగా కృష్ణయ్య గౌడ్, డైరెక్టర్‌గా నిరంజన్ గౌడ్ ఎన్నుకోబడ్డారు. ఎన్నికల అధికారి యాదగిరి యాదవ్ మదన్ గౌడ్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గౌడ సంఘం నాయకులు మట్ట వెంకటయ్య గౌడ్, మట్ట కృష్ణ గౌడ్, ఆంజనేయులు, చంద్రకాంత్, గౌడ్ నాగయ్య తదితరులు పాల్గొన్నారు.


# ఉప్పల్‌లో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



**ఉప్పల్, మే 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఉప్పల్ చౌరస్తాలో సోమవారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి కాంగ్రెస్ శ్రేణులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, "ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధి కోసం సీఎం గారు 37.10 కోట్లు మంజూరు చేశారు. విద్యారంగంపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజా పాలన ద్వారానే నాణ్యమైన విద్య అందించాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నారు" అని తెలిపారు. కార్యక్రమంలో ఉప్పల్ మాజీ కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# 'అభివృద్ధి చూసే కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు'

**- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**



**ఆమనగల్లు, మే 11 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ప్రజాసేవ చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కడ్తాల్ మండలం కర్కల్ పహాడ్ సర్పంచ్ తేజ నాయక్, వార్డు సభ్యులు శారద పాండు, పట్నం లలిత, పట్నం రమేష్ మరియు వివిధ పార్టీల నుండి నాయకులు రామకృష్ణ, చంద్రశేఖర్, విఘ్నేష్ లు సోమవారం పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలో ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి చేపట్టిన పలు సంక్షేమ పథకాలు ప్రజలకు నేరుగా అందుతూ ప్రయోజనం చేకూరుస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి పేద కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా పాలనకు ఆకర్షితులై సర్పంచ్లు, వార్డు సభ్యులు, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నర్సింహా, జిల్లా సోషల్ మీడియా కో ఆర్డినేటర్ బత్తోజు విష్ణు వర్ధన్, నల్లబోతుల అయోధ్య, సయ్యద్ జలాలుద్దీన్, సిద్ధిగారి యాదయ్య, ఎన్. రాజేందర్ రెడ్డి, పట్నం నర్సింహా, పట్నం శివరాజు, కంబాలపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

# పారిశుధ్య కార్మికులకు రక్షణ సామాగ్రి పంపిణీ



**దేవరకొండ మే 11 (నీలగిరి ఎక్స్ ప్రెస్).** తీవ్రమైన వేసవి ఎండలను దృష్టిలో ఉంచుకొని, దేవరకొండ పురపాలక సంఘం పరిధిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల ఆరోగ్య రక్షణ కోసం మునిసిపల్ చైర్మన్ పున్న శైలజ సోమవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ గారి చేతుల మీదుగా కార్మికులకు టోపీలు మరియు మాస్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నగరాన్ని శుభ్రంగా ఉంచడంలో కీలక పాత్ర పోషించే కార్మికులు ఎండల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, వారి సంక్షేమానికి తమ పాలకవర్గం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమం లో మునిసిపల్ కమీషనర్ రామదుర్గా రెడ్డి, సానిటరీ ఇన్స్పెక్టర్ శంకర్ గౌడ్, వివిధ వార్డుల కౌన్సిలర్లు మరియు కో ఆప్షన్ సభ్యులు, మునిసిపల్ పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

# జనగణనలో ప్రతి ఒక్కరూ భాగమవ్వాలి

**- కౌన్సిలర్ ఎర్రవోలు మహేష్**



**ఆమనగల్లు, మే 11 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** జనాభా గణనలో ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా పాల్గొని వివరాలు నమోదు చేయించుకోవాలని కౌన్సిలర్ ఎర్రవోలు మహేష్ తెలిపారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డు శ్రీకాంత్ కాలనీలో మొదటి దశ హౌస్ లిస్టింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఎర్రవోలు మహేష్ హాజరై మాట్లాడారు.. క్షేత్రస్థాయిలో వచ్చే సిబ్బందికి ప్రజలు నిర్భయంగా సమాచారం అందించాలని కోరారు. సేకరించిన వివరాలు డేటా ప్రైవసీ చట్టాల ప్రకారం గోప్యంగా ఉంటాయని, ఇవి కేవలం సంక్షేమ పథకాల రూపకల్పనకే ఉపయోగపడతాయని స్పష్టం చేశారు. ఈ జాతీయ యజ్ఞంలో ఆమనగల్లు మున్సిపాలిటీని జిల్లాలోనే ఆదర్శంగా నిలపాలని కోరారు. కార్యక్రమంలో సెన్సస్ సూపర్వైజర్ పి. కృష్ణయ్య, ఎన్యూమరేటర్ కిషన్ తదితరులు ఉన్నారు.

# పీజీఆర్ఎస్ ఫిర్యాదుల పై చట్ట పరిధిలో సత్వర న్యాయం చేస్తాం

**- ఎస్పీ సునీల్ షోరాణ్**




**నంద్యాల, మే 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయం, బొమ్మలసత్రంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్, ఐపీఎస్ ప్రజల నుంచి 103 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, "జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రతి ఫిర్యాదును పూర్తిస్థాయిలో విచారణ జరిపి, చట్ట పరిధిలో తక్షణమే పరిష్కారం చూపిస్తాం. నిర్ణీత గడువులోపల సమస్యలు పరిష్కరించాలి. ఫిర్యాదులు పునరావృతం కాకుండా చూడాలి. ప్రజా సమస్యల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శించరాదు" అని అధికారులను ఆదేశించారు.

# జనగణన గృహాల లెక్కింపును పర్యవేక్షించాలి

**-- కలెక్టర్ బి. చంద్రశేఖర్**



**నల్లగొండ, మే 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ, "జనగణనలో భాగంగా సోమవారం నుండి ప్రారంభమైన గృహాల లెక్కింపు కార్యక్రమాన్ని మండల ప్రత్యేక అధికారులు పర్యవేక్షించాలి. ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లు ప్రతి ఇంటిని సరిగా పరిశీలించి నివేదిక సమర్పించాలి" అని ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం అనంతరం జిల్లా అధికారులతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ఇందిరమ్మ ఇండ్లకు ఎక్కువగా దరఖాస్తులు వస్తున్నాయి. వాటిని క్షుణ్ణంగా పరిశీలించి, గజిటెడ్ అధికారి ధ్రువీకరించిన తర్వాత లాగిన్‌కు పంపాలి" అని సూచించారు. మండల ప్రత్యేక అధికారులు తక్షణమే ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో సమావేశం నిర్వహించి, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లకు లబ్ధిదారులను ఎంపిక చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

# మానవ జీవితంలో యోగా అవసరం

**- కలెక్టర్ బి. చంద్రశేఖర్**



**నల్లగొండ, మే 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ, "చిన్ననాటి నుంచే యోగా సాధన చేయడం ద్వారా మానసిక, శారీరక దృఢత్వం పెరుగుతుంది. వ్యాధులకు దూరంగా ఉండి ఆరోగ్యవంతమైన జీవితం గడపవచ్చు" అని అన్నారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో వైదిక యోగ పీఠ్ ఫౌండర్ కరుణాకర్ గురూజీ రూపొందించిన యోగాసనాల పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, "యోగాసనాల చిత్రాలతో పాటు వాటి ప్రాధాన్యత, ఎవరు చేయాలి -- ఎవరు చేయకూడదు అనే అంశాలను సమగ్రంగా వివరించడం ద్వారా ఈ పుస్తకం ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుంది" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీఎం శ్రీ యోగ టీచర్లు మంజునాథ్, జానీ, విజయ, జ్యోతి, శకుంతల, పావని వెంకట్, ప్రసాద్, మధు, శ్రీనివాస్, సంధ్య రాణి, ప్రవీణ్, జయశ్రీ, హరితరాణి, నాగజ్యోతి, సుజిత, లీలా కుమారి, దివ్య, మృదుల, వెంకటయ్య, యాదమ్మ, కోమల, వైష్ణవి, భారతి, నరేష్, సోమేశ్వరి, గాయత్రి, శ్రీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.ం

# ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టలో బైరెడ్డి మల్లికార్జున్ రెడ్డి



**నందికొట్కూరు, మే 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నందికొట్కూరు నియోజకవర్గం పగిడ్యాల మండల నెహ్రూనగర్ గ్రామంలో జరిగిన శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి వైస్సార్సీపీ సీనియర్ నాయకుడు, పెద్దలు డాక్టర్ బైరెడ్డి మల్లికార్జున్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వామివారి విశిష్ట పూజల్లో పాల్గొని గ్రామ ప్రజలతో కలసి తీర్థప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పుల్యాల నాగిరెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్న మల్లారెడ్డి, మాజీ సర్పంచులు ముచ్చుమర్రి మద్దిలేట్టి, తిమ్మాపురం స్వామిరెడ్డి, మాజీ ఎంపీటీసీ వెంకటేశ్వర్లు, గ్రామ నాయకులు పులేంద్ర నాయుడు, రవికుమార్ యాదవ్, మహమ్మద్, వివిధ గ్రామాల నాయకులు, వైస్సార్సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# 18న ఉచిత కంటి వైద్య శిబిరం



**ఆమనగల్లు, మే 11 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు ఆధ్వర్యంలో ఈ నెల 18న ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా ఉన్న రాంరెడ్డి లయన్ ఐ హాస్పిటల్ విజన్ సెంటర్లో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ పిఆర్ఓ ఎం.ఏ పాష సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిసర గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కంటిచూపు మందగించిన వారు తమ గుర్తింపు కార్డులైన ఆధార్ లేదా రేషన్ కార్డుతమ వెంట తెచ్చుకోవాలని పాషా సూచించారు.

# ప్రజలు సుభిక్షంగా ఉండాలి

**- టీపీసీసీ సభ్యులు శ్రీనివాస్ గౌడ్**

**- అమ్మవారి ఆలయానికి శ్రీనివాస్ గౌడ్ భారీ విరాళం**



**ఆమనగల్లు, మే 11 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** గ్రామ దేవతల ఆశీస్సులతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని టీపీసీసీ సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. కడ్తాల్ మండల పరిధిలోని గానుగు మార్ల తండా గ్రామపంచాయతీలో నూతనంగా నిర్మిస్తున్న తుల్జా భవాని దేవాలయానికి సోమవారం ఆలయ కమిటీ సభ్యులకు శ్రీనివాస్ గౌడ్ రూ. 50,000 విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని, తుల్జా భవాని అమ్మవారి దీవెనలు ప్రజలందరిపై ఉంటాయని తెలిపారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను, సోదరభావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ప్రతి కుటుంబం సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మోత్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# మర్రిగూడ మండలంలో జనగణన ప్రారంభం



**మర్రిగూడ, మే 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మర్రిగూడ మండలంలోని 18 గ్రామపంచాయతీలలో జనగణన కార్యక్రమం సోమవారం లాంఛనంగా ప్రారంభమైంది. ఇన్‌చార్జ్ అధికారి తహసిల్దార్ జక్కర్తి శ్రీనివాసులు, ఎంపీడీవో మున్నయ్య కలిసి సర్వే ప్రారంభించారు. జూన్ 10 వరకు కొనసాగే ఈ ప్రక్రియలో 52 మంది ఎన్యూమరేటర్లు పాల్గొని గృహ నంబర్ల వారీగా వివరాలు సేకరించనున్నారు. ప్రజలందరూ సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యరగండ్లపల్లి గ్రామ సర్పంచ్ వల్లంల సంతోష్ యాదవ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## నీటి సంరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

-- కలెక్టర్ బి. చంద్రశేఖర్




**నల్లగొండ, మే 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ, "ప్రతి వర్షపు నీటి చుక్కను సంరక్షించుకోవాలి. నీటిని పొదుపుగా వాడుకోవడం మనందరి బాధ్యత. నీటి సంరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై సహకరించాలి" అని పిలుపునిచ్చారు."జల్ సంచయ్ -- జన బాగిదారి" కార్యక్రమంలో భాగంగా సోమవారం నల్గొండ కలెక్టర్ కార్యాలయం వద్ద ప్రచార రథాన్ని ఆయన నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డితో కలిసి జెండా ఊపి ప్రారంభించారు.కలెక్టర్ మాట్లాడుతూ, "ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని నీటి వనరుల సంరక్షణ అత్యవసరం. కమ్యూనిటీ సోక్ పిట్లు, వ్యక్తిగత సోక్ పిట్లు, ఫామ్ పాండ్స్, నీటి సంరక్షణ కట్టడాలపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించాం. ప్రజలందరూ సహకరించాలి" అని తెలిపారు.నగర మేయర్ చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, "ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత తప్పనిసరిగా ఉండాలి. నీటిని పొదుపుగా వాడితే భావితరాలకు నీటి కొరత ఉండదు. మున్సిపల్ పరిధిలో ఇల్లు నిర్మించుకునే వారికి ఇంకుడు గుంత నిర్మాణం తప్పనిసరి చేస్తాం" అని అన్నారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, గృహనిర్మాణ శాఖ పీడీ రాజ్‌కుమార్, గ్రామీణ అభివృద్ధి అధికారి శేఖర్ రెడ్డి, డిపిఆర్‌ఓ వెంకటేశ్వర్లు, కార్పొరేటర్ జ్ఞానేశ్వరి, ఏఓ మోతిలాల్, డిఆర్డిఏ సిబ్బంది, తెలంగాణ సాంస్కృతిక సారధి కళాబృందం తదితరులు పాల్గొన్నారు.

## కులం పేరుతో దూషించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

- మాల మహానాడు నాయకులు





**లింగాల, మే 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
లింగాల మండల పరిధిలోని కొత్తకుంటపల్లి గ్రామానికి చెందిన తగిలి రాజు తండ్రి శీనుపై కులం పేరుతో దూషించి దాడి చేసిన ఘటనపై మాల మహానాడు నాయకులు తీవ్రంగా స్పందించారు.జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ పాటిల్ను కలిసి ఈ కేసును వేగవంతం చేసి, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. "కులం పేరుతో దూషించడం, దాడి చేయడం అసహ్యం. ఇలాంటి వారిని కఠినంగా శిక్షించాలి" అని నాయకులు స్పష్టం చేశారు.ఈ సందర్భంగా మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి చింతసత్తి మాలమాడు, జిల్లా అధ్యక్షుడు మద్దిలేటి చంటి, మాల ఎడ్యుకేషన్ వెల్ఫేర్ సొసైటీ జనరల్ సెక్రటరీ పేరుమాల యాదయ్య, మాల జన సమితి అధ్యక్షుడు తగిలి హుస్సేన్, దాసరి రాములు తదితరులు పాల్గొన్నారు.

## కొల్లాపూర్‌లో జనగణన తొలి దశ ప్రారంభం




**కొల్లాపూర్, మే 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కొల్లాపూర్ పట్టణ కేంద్రంలో జనగణన తొలి దశ కార్యక్రమం లాంఛనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ రెడ్డి జ్యోతి సత్యం హౌస్ లిస్టింగ్, హౌసింగ్ సెన్సస్ కార్యక్రమాలను ప్రారంభించారు.అధికారులు మాట్లాడుతూ, "జనగణన ప్రక్రియను డిజిటల్ విధానంలో నిర్వహిస్తూ, ప్రజలకు స్వీయ గణన సౌకర్యం కూడా అందుబాటులోకి తీసుకువచ్చాం. సమగ్ర, ఖచ్చితమైన సమాచారం సేకరణకు ప్రజల సహకారం అత్యవసరం" అని తెలిపారు.జనగణన విజయవంతం కావడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సూపర్వైజర్లు, ఎన్యూమరేటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఇర్విన్‌లో వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం




**మాడుగుల, మే 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మాడుగుల మండలంలోని ఇర్విన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వేసవి శిక్షణ శిబిరం సోమవారం లాంఛనంగా ప్రారంభమైంది.ఈ కార్యక్రమంలో మండల ఎంఈఓ సర్దార్ నాయక్, ఇర్విన్ గ్రామ సర్పంచ్ కోటేష్, ఏఏపీసీ చైర్మన్ శ్రీమతి స్వర్ణలత, పాఠశాల హెడ్‌మాస్టర్ ఎల్. పర్వతాలు పాల్గొన్నారు.

# ప్రతి ఫిర్యాదును పూర్తిస్థాయిలో పరిశీలించి ఎండార్స్మెంట్ ఇవ్వాలని కలెక్టర్ ఆదేశం



**నంద్యాల, మే 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, "ప్రజలు సమర్పించే ప్రతి ఫిర్యాదును పూర్తిస్థాయిలో పరిశీలించి, సమస్యకు అనుగుణంగా స్పష్టమైన ఎండార్స్మెంట్ ఇవ్వాలి. అలా చేస్తే అర్జీదారులు సంతృప్తి చెందుతారు, దరఖాస్తులు తిరిగి రీఓపెన్ కాకుండా ఉంటాయి" అని అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 286 వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, "ముఖ్యమంత్రి కార్యాలయం, ఉప ముఖ్యమంత్రి కార్యాలయం స్థాయిలో కూడా రీఓపెన్ అయిన దరఖాస్తులను స్వయంగా పరిశీలిస్తున్నారు. అధికారులు ప్రత్యేక శ్రద్ధతో వ్యవహరించాలి" అని సూచించారు.జిల్లాలో మొత్తం 5,306 దరఖాస్తులు రీఓపెన్ కాగా, వాటిలో 5,064 పరిష్కరించబడ్డాయి. ఇంకా పెండింగ్‌లో ఉన్న 242 దరఖాస్తులపై సంబంధిత అర్జీదారులతో నేరుగా మాట్లాడి త్వరితగతిన పరిష్కారం చూపాలని కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యమంత్రి కార్యాలయం పరిధిలో రీఓపెన్ అయిన 171 దరఖాస్తుల్లో 166 పరిష్కరించబడ్డాయి, మిగిలిన 5పై చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి కార్యాలయం పరిధిలో రీఓపెన్ అయిన అన్ని దరఖాస్తులు పూర్తిగా పరిష్కరించబడ్డాయని వెల్లడించారు.ఈ సందర్భంగా ప్రజలు సమర్పించిన వినతుల్లో, ఆళ్లగడ్డ పాలసాగరం గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంట్ ఆరు నెలలుగా పనిచేయకపోవడంపై తక్షణ చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌ను కలెక్టర్ ఆదేశించారు. అలాగే, నంద్యాల పట్టణానికి చెందిన బి. నాగమణి వితంతు పింఛన్ మంజూరు చేయాలని కోరగా, శ్రీనివాసనగర్‌కు చెందిన ఎస్. గోవిందస్వామి భారీ వృక్షాల కొమ్మలు హై వోల్టేజ్ తీగలపై పడే ప్రమాదం ఉందని వినతి పత్రం సమర్పించారు.ఈ కార్యక్రమంలో డీఆర్ఓ రాము నాయక్, పీజీఆర్ఎస్ నోడల్ అధికారి ఉమామహేశ్వరి, ఆర్డీవోలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.


## ప్రమాదకరంగా మారిన కల్వర్టుపై స్పందన



**పాలకుర్తి, మే 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పాలకుర్తి మండల కేంద్రంలోని ఎల్లమ్మ గుడి వద్ద ప్రధాన రహదారిపై ప్రమాదకరంగా మారిన కల్వర్టు గురించి నీలగిరి ఎక్స్‌ప్రెస్‌లో మే 8న ప్రచురితమైన వార్తకు గ్రామ సర్పంచ్ పెద్దపల్లి తిరుమల ఆజిమల్లు స్పందించారు.ఆయన సోమవారం గ్రామ పంచాయతీ సిబ్బందితో కలిసి సిమెంట్, ఇసుక, కంకరతో గుంతను పూడ్చివేయించారు. దీంతో వాహనదారులు తాత్కాలికంగా సౌకర్యం పొందుతూ సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.అయితే రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని శాశ్వత పరిష్కారం అవసరమని ప్రజలు కోరుతున్నారు. డబుల్ రోడ్డు నిర్మాణం, స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేయాలని రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కన్ సింగ్‌ను సంప్రదించి వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.ప్రజల భద్రత కోసం శాశ్వత పరిష్కారం అవసరమని డిమాండ్ పెరుగుతోంది.




## కౌన్సిలర్ భర్త దౌర్జన్యాలపై బాధిత కుటుంబాల ఆవేదన



**హుస్నాబాద్, మే 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హుస్నాబాద్ మున్సిపల్ పరిధిలోని ఆరేపల్లిలో కౌన్సిలర్ భర్త దౌర్జన్యంగా వ్యవహరిస్తున్నాడని బాధిత కుటుంబాలు ఆరోపించాయి.ఆరేపల్లి బైపాస్ పొట్లపెల్లి రోడ్డులో కోతి బొమ్మ చౌరస్తా వద్ద వట్టె మల్లేశం ఇంటి వద్ద ఈ ఘటన చోటుచేసుకున్నట్లు తెలిపారు. అభివృద్ధి పనుల పేరుతో మున్సిపాలిటీ అనుమతులు లేకుండానే ఇంటి ప్రహరీ గోడ, ఆవరణలోని వాటర్ ట్యాంక్‌తో పాటు ప్రభుత్వ వాటర్ ట్యాంక్‌ను కూల్చివేశారని బాధితులు వాపోయారు.ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం, తమ ఇంటికి జరిగిన నష్టంపై మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ వాటర్ ట్యాంక్ కూల్చివేతతో పలువురు కుటుంబాలు తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నా అధికారులు స్పందించడం లేదని తెలిపారు.ఈ నేపథ్యంలో బాధితులు వట్టె మల్లేశం, కోట మల్లేశం, పెద్ది ఓదయ్యలు మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్‌ను కలిసి తమ గోడును వినిపించారు. కౌన్సిలర్ భర్త దౌర్జన్యాలను అరికట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో కుటుంబాలతో కలిసి స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి పొన్నం దృష్టికి విషయం తీసుకెళ్తామని హెచ్చరించారు.

## అంజనీపుత్రుని ప్రత్యేక పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి



**నందికొట్కూరు, మే 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం నెహ్రూనగర్ గ్రామంలో వెలిసిన శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాన్ని స్వీకరించారు.ముందుగా గ్రామంలోకి ప్రవేశించిన బైరెడ్డికి మాజీ సర్పంచ్, టీడీపీ నాయకుడు కట్టుబడి శ్రీనివాస నాయుడు ఆధ్వర్యంలో మేళతాళాలు, డప్పు వాయిద్యాలు, తప్పెట్లతో ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా బైరెడ్డి మాట్లాడుతూ, "గ్రామంలో ఐక్యత, ఆధ్యాత్మిక భావం పెంపొందించేందుకు కృషి చేసిన గ్రామ పెద్దలు అభినందనీయులు. శ్రీ అభయాంజనేయ స్వామి ఆశీస్సులతో నెహ్రూనగర్ గ్రామం అభివృద్ధి చెందాలి" అని ఆకాంక్షించారు.తరువాత ఆయన రెండు దేవాలయాల్లో, రెండు ధ్వజస్థంభాల వద్ద పూజలు చేసి దర్శనం అనంతరం ఘన సన్మానం పొందారు.ఈ కార్యక్రమంలో కట్టుబడి శ్రీనివాస నాయుడు, కట్టుబడి బాబు, బాల వీరయ్య, మల్లయ్య, రవీంద్రరెడ్డి, వీభూది నాయుడు, బలరాముడు, మునిరంగడు, మురళి, మహేష్, ధర్మక్షేత్ర, జయరాముడు తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగంలో కల్పించిన హక్కులను ప్రతి ఒక్కరూ అందిపుచ్చుకోవాలి - సలాం ఖాన్



**నందికొట్కూరు, మే 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
"భారత రాజ్యాంగంలో కల్పించిన హక్కులను ప్రతి ఒక్కరూ అందిపుచ్చుకోవాలి. అవి మన సొత్తు" అని తాలూకా అధ్యక్షుడు సలాం ఖాన్ పేర్కొన్నారు.మే 9, 10 తేదీలలో నెల్లూరులోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో జరిగిన రాష్ట్ర ఆవాజ్ కమిటీ మూడవ మహాసభలో ఆయన మాట్లాడుతూ, "రాజ్యాంగ లౌకికత్వంపై ప్రధాన వక్తలు అద్భుతంగా వివరించారు. కొత్త రాష్ట్ర కమిటీ ఏర్పాటు చేసి, మన పట్టణానికి చెందిన అబ్దుల్ రహిమాన్కు చోటు కల్పించడం గర్వకారణం" అని అన్నారు.రాష్ట్ర కమిటీ సభ్యుడు అబ్దుల్ రహిమాన్ మాట్లాడుతూ, "నెల్లూరులో జరిగిన లౌకికత్వ సెమినార్‌లో మద్రాస్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి చంద్రు ప్రసంగం అందరినీ ఆకట్టుకుంది. దేశంలో మతతత్వ రాజకీయాలపై ప్రజా వ్యతిరేక విధానాలను ఆయన విశ్లేషించారు. ప్రతి ఇంటిలో రాజ్యాంగం ఉండాలి, ప్రతి ఒక్కరూ రాజ్యాంగం చదివి తమ హక్కులను తెలుసుకోవాలి" అని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆవాజ్ కమిటీ నాయకులు మహబూబ్ బాషా, రఫీ, అబ్దుల్లా, హకీమ్, రియాజ్, కల్పతుల్లా, అజ్మతుల్లా, షేక్షా, షమీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

## అలగనూరు రిజర్వాయర్ నిర్మాణంపై సీపీఐ ఆందోళన హెచ్చరిక




**నందికొట్కూరు, మే 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
"రైతుల ప్రభుత్వమని గొప్పలు చెప్పుకుంటున్న కూటమి నేతలు, అలగనూరు రిజర్వాయర్ రైతుల బాధను పట్టించుకోవడం లేదు. 15 ఏళ్లుగా ఒక్క రూపాయి నిధులు కూడా విడుదల చేయకపోవడం రైతుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని స్పష్టంగా చూపిస్తోంది" అని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు విమర్శించారు.సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సభ్యులు వి. రఘురాం మూర్తి, ఎం. రమేష్ బాబుతో కలిసి మీడియాతో మాట్లాడిన ఆయన, "జడ్పీ కార్యాలయం ఎదుట అనేక ఆందోళనలు చేసినా కూటమి నేతలు మొద్దు నిద్ర విడవడం లేదు. అధికార పార్టీ ఆఫీసు కోసం రైతుల భూములు లాక్కొని ఎనిమిది నెలల్లో పూర్తి చేస్తామని చెప్పే నేతలు, వేలాది మంది రైతులకు ఉపయోగపడే అలగనూరు రిజర్వాయర్‌ను మాత్రం పూర్తి చేయడం లేదు" అని మండిపడ్డారు.అలాగే, "నందికొట్కూరు, పాణ్యం ఎమ్మెల్యేల ఇళ్లను ముట్టడించే స్థితి రాకుండా ప్రభుత్వం వెంటనే స్పందించాలి. 32 కోట్ల నిధులు విడుదల చేయకపోవడం వల్ల పట్టణ ప్రజలు త్రాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నారు. దీనికి పాలకులే కారణం" అని ఆయన హెచ్చరించారు.

# శ్రీశైలంలో శోభాయమానంగా కలశయాత్ర





**- సహస్రకలశారాధన, శివపంచాక్షరీ యజ్ఞంతో వైభవంగా కార్యక్రమాలు**
**- వేల సంఖ్యలో పాల్గొన్న భక్తులు**

**శ్రీశైలం, మే 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** శ్రీశైల క్షేత్రంలో సోమవారం సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్ భాగంగా కలశయాత్ర వైభవంగా జరిగింది. ఉదయం అక్కమహాదేవి అలంకార మండపంలో అర్చకస్వాములు సంకల్పం పఠించి మహాగణపతిపూజ అనంతరం సహస్రకలశారాధన నిర్వహించారు. గంగానది పుణ్యజలాలను కలశాలలో ఆహ్వానించి భక్తులకు అందజేశారు. భక్తులు కలశాలను తలపై ధరించి ఆలయ ప్రాంగణం నుంచి బయలువీరభద్రస్వామి ఆలయం వరకు శ్రద్ధాభక్తులతో యాత్రలో పాల్గొన్నారు. అనంతరం స్వామివారికి విశేష పూజలు జరిపి తిరిగి ఆలయ



ప్రాంగణానికి చేరి శ్రీవృద్ధమల్లికార్జునస్వామివారికి కలశాభిషేకం నిర్వహించారు. ఈ కలశయాత్రలో సుమారు వెయ్యి మంది భక్తులు పాల్గొని స్వామివారి అలంకార దర్శనం, అమ్మవారి దర్శనం పొందారు. కలశయాత్ర అనంతరం శివపంచాక్షరీ నామలేఖన యజ్ఞం ప్రారంభమైంది. భక్తులకు పుస్తకాలు, కలములు అందజేసి "ఓం నమః శివాయ" మంత్రాన్ని వ్రాయించి స్వామివారికి సమర్పించారు. సాయంత్రం గంగాధర మండపంలో ధార్మిక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. వనపర్తి నుంచి వచ్చిన బృందం శివభజనలు ఆలపించగా, రాజమహేంద్రవరం నుంచి తాతా సందీప్ శర్మ ఓంకార ప్రాశస్త్యంపై ప్రవచనం చేశారు. అనంతరం విజయనగరం సుప్రియ బృందం పేరిణి శివతాండవం ప్రదర్శించి భక్తులను మంత్రముగ్ధులను చేశారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ, "సోమనాథ ఆలయంపై దాడి జరిగి వెయ్యి సంవత్సరాలు, పునర్నిర్మాణం జరిగి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా దేశవ్యాప్తంగా సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. సంప్రదాయ పరిరక్షణకు దేవాలయమే ఆలవాలమై, ధర్మాచరణ వల్ల సమాజం పటిష్టమవుతుంది" అని పేర్కొన్నారు.

# బస్టాండ్ నిర్మాణానికి స్థలం కేటాయించాలని వినతి




**పాలకుర్తి, మే 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** : పాలకుర్తి మండలం రామారావుపల్లి గ్రామంలోని ప్రధాన రహదారికి ఆనుకుని బస్టాండ్ నిర్మాణం కోసం స్థలాన్ని కేటాయించాలని కోరుతూ సర్పంచ్ అన్నం లక్ష్మీ నారాయణ సోమవారం తహసీల్దార్ జే. సునీతకు వినతి పత్రం సమర్పించారు. గ్రామంలో మెయిన్ రోడ్డుకు ఆనుకుని కొంత ప్రభుత్వ స్థలం ఉందని, ఆ స్థలానికి హద్దులు నిర్ణయిస్తే బస్టాండ్ నిర్మాణం చేపడతామని ఆయన తెలిపారు. బస్ షెల్టర్ లేకపోవడంతో ఎండలు, వర్షాల సమయంలో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారి సౌకర్యార్థం బస్టాండ్ నిర్మించాలని నిర్ణయం తీసుకున్నట్లు ఉప సర్పంచ్ బండి సాగర్, కాంగ్రెస్ నాయకుడు అన్నం కృష్ణ పేర్కొన్నారు. ప్రయాణికుల సౌకర్యం కోసం బస్టాండ్ నిర్మాణం అత్యవసరమని గ్రామస్థులు అభిప్రాయపడుతున్నారు.

# శాతవాహన ఫార్మసీ కళాశాలలో జంతుశాల ప్రారంభోత్సవం




**కరీంనగర్, మే 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** : మానేరు డామ్ పక్కన ఉన్న శాతవాహన ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాలలో తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ వారోత్సవాల సందర్భంగా జంతు శాలను ఉపకులపతి ఆచార్య ఉమేశ్ కుమార్ ప్రారంభించారు. ఆచార్య ఉమేశ్ మాట్లాడుతూ ఈ జంతు ప్రయోగశాల ద్వారా విద్యార్థులు ప్రీ క్లినికల్ రీసెర్చ్ చేయడానికి ప్రత్యేక శిక్షణ పొందుతారని, కొత్త ఔషధ ఆవిష్కరణలలో భద్రత, సమర్థతను నిర్ధారించడానికి ఇది కీలకమని తెలిపారు. బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ విద్యార్థులు కొత్త పరిశోధనలను చేసి అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొనే అవకాశాలు పెరుగుతాయని అన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య సతీష్ కుమార్ మాట్లాడుతూ ఫార్మకాలజీ పరిశోధనలో జంతు శాల వెన్నెముక వంటిదని, జీవ వ్యవస్థలో మందులు ఎలా తయారవుతాయి, ఎలా పంపిణీ అవుతాయి, మానవ శరీరంపై ఎలా పనిచేస్తాయో ముందుగా జంతువులపై ప్రయోగాలు చేసి తెలుసుకోవడం అవసరమని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. శ్రీశైలం, సీడీసీ డీన్ డా. జాఫర్, డా. శ్రీవాణి, డా. నజీముద్దీన్ మున్వర్, అధ్యాపకులు డా. క్రాంతి, డా. అనిల్, డా. భాగ్యలక్ష్మి, డా. శ్రీవిద్య, డా. అశ్విని, డా. అర్చన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. ఫార్మసీ పరిశోధనలో కొత్త దిశగా శాతవాహన ఫార్మసీ కళాశాల జంతు శాల ప్రారంభం నిలిచింది.

# ఘనంగా ప్రారంభమైన విద్యా వారోత్సవాలు





**గంగాధర, మే 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా కరీంనగర్ జిల్లా గంగాధర మండలంలో విద్యా వారోత్సవాలు 11--05--2026 నుండి 17--05--2026 వరకు ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గంగాధర హైస్కూల్‌లో భవిత యాక్టివిటీ రూమ్, టీజీఎంఎస్ గంగాధరలో సమ్మర్ క్యాంప్, గర్షకుర్తి పాఠశాలలో కిచెన్ షెడ్ ప్రారంభోత్సవాలు జరిగాయి. ఈ కార్యక్రమాలను సర్పంచ్‌లు శ్రీమతి పడాల భాగ్యలక్ష్మి, శ్రీ రెండ్ల శ్రీనివాస్, శ్రీ ఆంజనేయులు మరియు వార్డ్ సభ్యులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఆర్వో శ్రీమతి అంబటి రజిత, ఎంపీడీఓ శ్రీ దమ్మాని రాము, ఎస్సై శ్రీ వంశీకృష్ణ, ఎంఈఓ శ్రీ ఏనుగు ప్రభాకర్ రావు విద్యార్థులకు ప్రేరణాత్మక సందేశాలు అందించారు. ఎంపీడీఓ రాము మాట్లాడుతూ విద్యార్థులు సమ్మర్ క్యాంప్ ద్వారా కళలు, క్రాఫ్ట్స్, సంగీతం, క్రీడలు, రచనా నైపుణ్యాలు నేర్చుకొని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. మే 25న జరిగే ముగింపు కార్యక్రమంలో తమ ప్రతిభను ప్రదర్శించాలని ఎంఆర్వో అంబటి రజిత విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ వేడుకల్లో ప్రిన్సిపాల్ శ్రీమతి పద్మ, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. విద్యా వారోత్సవాల తొలి రోజు గంగాధరలో ప్రేరణాత్మక వాతావరణం నెలకొంది.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

**- కలెక్టర్ కె.హైమావతి**



**సిద్ధిపేట, మే 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** జిల్లా కలెక్టర్ కె. హైమావతి ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత అధికారులు వేగవంతంగా పరిశీలించి, అర్హతల మేరకు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ స్వయంగా ప్రజల వినతులను స్వీకరించారు. ప్రజలు తమ సమస్యలు పరిష్కారం అవుతాయనే నమ్మకంతో ప్రజావాణికి వస్తారని, అందువల్ల ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి న్యాయం జరిగేలా అధికారులు కట్టుదిట్టంగా పనిచేయాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ సమస్యల పరిష్కారం కోసం వచ్చిన ప్రజల నుండి మొత్తం 94 దరఖాస్తులు స్వీకరించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ నాగరాజమ్మ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ప్రజావాణి దరఖాస్తులను సత్వర పరిష్కారం చేయాలని కలెక్టర్ హైమావతి స్పష్టం చేశారు.

# మహిళా సమైఖ్య సంఘం భవనన్ని ప్రారంభించిన కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి



**కరీంనగర్, మే 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

కరీంనగర్ రూరల్ మండలం బహదూర్ఖాన్‌పేటలో రూపాయలు పది లక్షలతో నిర్మించిన మహిళా సమైఖ్య సంఘ భవనాన్ని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించిన ఈ మహిళా భవనం మహిళా సాధికారతకు ఉపయోగపడాలని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలను దృష్టిలో పెట్టుకొని అనేక పథకాలను ప్రవేశపెట్టిందని, మహిళా సాధికారత కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. సర్పంచ్ గుర్రం సంధ్య తిరుపతి రెడ్డి మాట్లాడుతూ ఈ సంఘ భవనం త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ జగన్ మోహన్ రెడ్డి, డీఈ జనార్ధన్, ఏఈ సమ్మయ్య, కంరెడ్డి రంరెడ్డి, సాయిని తిరుపతి, సర్పంచులు మోతే ప్రశాంత్ రెడ్డి, బోగొండ ఐలయ్య, కూర నరేష్ రెడ్డి, కామల్ గౌడ్, లక్ష్మి నారాయణ రాజు, అంజయ్య, బాపురెడ్డి, తిరుపతి అంజయ్య, మహిళా మండల సభ్యులు తదితరులు పాల్గొన్నారు. మహిళా సాధికారతకు కొత్త వేదికగా మహిళా సమైఖ్య సంఘ భవనం నిలవనుంది.

# అక్రమ పట్టాలను రద్దు చేసి అసలు సాగుదారులకు న్యాయం చేయాలని రైతుల నిరసన



**పెద్దపల్లి, మే 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ముత్తారం మండలం పోతారం గ్రామానికి చెందిన పేద రైతులు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సర్వే నంబర్ 59, మైదంబండ గ్రామ శివారులోని సర్వే నంబర్ 113లో కొందరు అక్రమార్కులు అసైన్మెంట్ కమిటీ ఆమోదం లేకుండా అక్రమంగా పట్టాలు పొందారని, వాటిని వెంటనే రద్దు చేసి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. రైతులు మాట్లాడుతూ గత 50 సంవత్సరాలుగా తమ పూర్వీకుల కాలం నుండి భూమిని సాగు చేస్తున్నప్పటికీ ఇప్పటివరకు పట్టాలు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ వీఆర్ఏ సహకారంతో కొందరు అధికారులు ప్రభుత్వాన్ని మోసం చేసి అక్రమ పట్టాలకు తెరలేపారని ఆరోపించారు. అక్రమ పట్టాలతో కోట్ల రూపాయల ప్రజాధనం దుర్వినియోగం జరిగిందని, రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రకారం ప్రభుత్వం, బ్యాంకుల నుండి పొందిన లోన్లు, రైతు బంధు, రైతు భరోసా నగదు మొత్తాన్ని తిరిగి వసూలు చేయాలని కోరారు. అదనపు కలెక్టర్ వేణు మాట్లాడుతూ అక్రమార్కులపై చట్టపరమైన చర్యలు తప్పవని, వారం రోజుల్లో విచారణ జరిపి రైతులకు న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ ధర్నాలో బీసీ జేఏసీ జిల్లా చైర్‌పర్సన్ దాసరి ఉష, దళిత సంఘం నాయకులు ఊట్ల శ్రీనివాస్, పోతారం గ్రామ రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అక్రమ పట్టాలను రద్దు చేసి అసలు సాగుదారులకు న్యాయం చేయాలని రైతులు కలెక్టర్‌ను కోరారు.

# ఉచిత విద్యుత్ మీటర్ల పంపిణీ



**పాలకుర్తి, మే 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గృహ జ్యోతి పథకంలో భాగంగా పాలకుర్తి మండలంలోని అన్ని గ్రామాల్లో అర్హులైన తెల్ల రేషన్ కార్డు కలిగిన ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఉచితంగా విద్యుత్ మీటర్లు అందజేయనున్నట్లు బసంతనగర్ సెక్షన్ ఏఈ మానాల ప్రసాద్ తెలిపారు. ఈ పథకం ద్వారా లబ్ధి పొందాలనుకునే వారు తమ తెల్ల రేషన్ కార్డు, ఆధార్ కార్డు, కుల ధృవీకరణ జిరాక్స్ పత్రాలను సంబంధిత ఏఈ కార్యాలయం లేదా గ్రామ పంచాయతీకి సమర్పించాలని సూచించారు. ఆలస్యం చేయకుండా దరఖాస్తులు సమర్పించాలని, ఈ అవకాశాన్ని అర్హులైన ఎస్సీ, ఎస్టీలు తప్పక వినియోగించుకోవాలని ఆయన కోరారు. ప్రభుత్వ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు పిలుపునిచ్చారు.

# హిందూ ఏక్తా యాత్రను విజయవంతం చేయాలని పిలుపు




**కరీంనగర్, మే 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** హనుమాన్ జయంతి సందర్భంగా కరీంనగర్ నగరంలో భారీ హిందూ ఏక్తా యాత్ర నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ యాత్ర మే 12, మంగళవారం సాయంత్రం 4 గంటలకు వైశ్య భవన్, గాంధీ రోడ్ నుండి ప్రారంభమవుతుంది. గడప లోపలే కులం... గడప దాటితే హిందువులం అనే నినాదంతో కులాలకు అతీతంగా హిందువుల ఐక్యతను చాటిచెప్పడమే ఈ కార్యక్రమం లక్ష్యం. భక్తులు, హిందూ బంధువులు వేలాదిగా తరలివచ్చి యాత్రను విజయవంతం చేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. హనుమాన్ జయంతి సందర్భంగా కరీంనగర్ నగరం హిందూ ఏక్తా యాత్రతో కాషాయమయం కానుంది.

## కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో తరగతి గదుల నిర్మాణ పనులకు శ్రీకారం



**బెజ్జంకి, మే 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
బెజ్జంకి మండలంలో పలు అభివృద్ధి పనులకు మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సోమవారం శ్రీకారం చుట్టారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో రూ.60 లక్షల వ్యయంతో చేపట్టిన నూతన తరగతి గదుల నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. అనంతరం లక్ష్మీపూర్ గ్రామంలో రూ.25 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. అలాగే రూ.6 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న పాఠశాల కిచెన్ షెడ్ పనులకు కూడా భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి తోడ్పడే ఈ పనులతో స్థానికులకు మెరుగైన వసతులు అందుతాయని, ముఖ్యంగా సీసీ రోడ్ల నిర్మాణం మౌలిక వసతుల కల్పనలో కీలకమని అన్నారు. ఈ కార్యక్రమాల్లో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముక్కిస రత్నాకర్ రెడ్డి, లక్ష్మీపూర్ గ్రామ సర్పంచ్ ముక్కిస కవిత, ఏఎంసీ వైస్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్ రెడ్డి, పార్టీ నాయకులు బి. రాజు, ఆర్. రామకృష్ణ, బైర సంతోష్ తదితరులు పాల్గొన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధి కోసం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పలు పనులకు శ్రీకారం చుట్టారు.

## ప్రజావాణి దరఖాస్తులు సత్వరమే పరిష్కరించాలి

- కలెక్టర్ చిత్రా మిశ్రా



**కరీంనగర్, మే 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులను అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి, తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ స్వయంగా ప్రజల వినతులను స్వీకరించారు. మొత్తం 129 మంది అర్జీదారులు దరఖాస్తులు సమర్పించగా, కొన్ని అక్కడికక్కడే పరిష్కరించగా మరికొన్నింటిని సంబంధిత అధికారులకు బదిలీ చేశారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన క్లియర్ చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రెవెన్యూ డివిజన్ల పరిధిలో కూడా ప్రజావాణి కార్యక్రమాలు జరిగాయి. కరీంనగర్ రెవెన్యూ డివిజన్‌లో 40, హుజురాబాద్ డివిజన్‌లో 16 దరఖాస్తులు స్వీకరించబడ్డాయి. కలెక్టర్, రెవెన్యూ డివిజన్లలో కలిపి మొత్తం 185 దరఖాస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, ఆర్డీవో మహేశ్వర్, జెడ్పీ సీఈఓ శ్రీనివాస్, డీఆర్‌డీఓ శ్రీధర్, ఏవో సుధాకర్ మరియు ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు. ప్రజావాణి ద్వారా ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించడం ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ చిత్రా మిశ్రా స్పష్టం చేశారు.

## రైతు సమస్యలపై కలెక్టర్‌తో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం భేటీ



**కరీంనగర్, మే 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ధాన్యం కొనుగోళ్లలో 43 కిలోల తూకాన్ని అంగీకరించబోమని హెచ్చరించిన చొప్పదండి ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు డా. మేడిపల్లి సత్యం రైతు సమస్యలపై జిల్లా కలెక్టర్‌తో సమావేశమయ్యారు. సత్యం మాట్లాడుతూ, రైస్ మిల్లర్లు ఇబ్బంది పెడితే రైతులతో కలిసి ధర్నాకు సిద్ధం అని స్పష్టం చేశారు. కేంద్ర జీపీఎస్ విధానం కారణంగా లారీల కొరత ఏర్పడిందని, ధాన్యం సేకరణ వేగవంతం చేయాలని కలెక్టర్‌ను కోరారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో ప్రత్యేక అధికారిని నియమించాలని, ప్రతిరోజూ సమీక్ష కోసం డాష్‌బోర్డు ఏర్పాటు చేయాలని సూచించారు. అతను పేర్కొన్నదేమిటంటే, గత రెండు సంవత్సరాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి రూ.1.6 లక్షల కోట్లు ఖర్చు పెట్టిందని, రుణమాఫీ, భరోసా, బోనస్, ఇన్‌పుట్ సబ్సిడీ వంటి పథకాల ద్వారా రైతులకు న్యాయం జరిగిందని అన్నారు. రైస్ మిల్లర్లు ఇబ్బందులు పెడితే నేను స్వయంగా వెళ్లి రైతులతో కలిసి ధర్నా చేస్తాను. ఎట్టి పరిస్థితుల్లోనూ 43 కిలోల తూకాన్ని అంగీకరించం" అని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఉప్పుల అంజన్ ప్రసాద్, ముత్యం శంకర్, కోల రమేష్, జవ్వాజి హరీష్ తదితరులు పాల్గొన్నారు. రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం స్పష్టం చేశారు.


# దివ్యాంగులకు సేవ చేయడం అందరి బాధ్యత

- మేయర్ కొలగాని శ్రీనివాస్



**కరీంనగర్, మే 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
సమగ్ర శిక్ష మరియు అలింకో ఆధ్వర్యంలో కరీంనగర్ భవిత కేంద్రంలో దివ్యాంగ బాలబాలికలకు ఉపకరణాల పంపిణీ కార్యక్రమం జరిగింది. గత నవంబరులో గుర్తించబడిన 120 మంది అవసరమైన దివ్యాంగులకు ట్రైసైకిళ్లు, రోలేటర్లు, వినికిడి యంత్రాలు, టి.ఎల్.ఎమ్ కిట్లు, వీల్‌చైర్లు వంటి ఉపకరణాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ దివ్యాంగులకు సేవ చేయడం అందరి బాధ్యత అని గుర్తు చేశారు. వీరికి సంబంధించిన అలవెన్సులు, సౌకర్యాలు సకాలంలో అందేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ దాదాపు రూ.20 లక్షల విలువైన ఉపకరణాలు ఈరోజు పంపిణీ చేయడం జరిగిందని, దివ్యాంగులకు సేవ చేయడం అదృష్టంగా భావించాలని అన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ మరియు విద్యాశాఖ అధికారి అశ్విని తానాజీ వాకిడి మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి తప్పనిసరిగా సౌకర్యాలు అందించాలని, ఎవరినీ విస్మరించకూడదని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మేయర్ కొలగాని శ్రీనివాస్, సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి, అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకిడి, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, జిల్లా విద్యాశాఖ ఎడి శ్రీరామ్ మొండయ్య, మండల విద్యాశాఖ అధికారి భద్రయ్య, కోఆర్డినేటర్ డి. శ్రీనివాస్, కార్పొరేటర్ పడాల శ్రీజ, ఐఇఆర్‌పి లు, తల్లిదండ్రులు, దివ్యాంగ పిల్లలు పాల్గొన్నారు. దివ్యాంగుల సంక్షేమం కోసం సమాజం మొత్తం బాధ్యతగా ముందుకు రావాలని మేయర్ పిలుపునిచ్చారు.

## మనోహరాబాద్‌లో రెడ్డి సంఘం నూతన కమిటీ ఏర్పాటు



**మనోహరాబాద్, మే 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రెడ్డి సంఘం సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఎనిమిది సంవత్సరాల క్రితం ఏర్పాటైన ఈ సంఘం పేద రెడ్డిల అభివృద్ధి కోసం పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తోంది. మండలంలోని అన్ని గ్రామాల రెడ్డి సంఘాలను ఐక్యవేదికగా ఏర్పాటు చేసి పేద రెడ్డిల అభివృద్ధికి కృషి చేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. అధ్యక్షుడిగా తీగుళ్ల నాగిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా తమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా వంగల వెంకటరెడ్డి కొండల్, జాయింట్ సెక్రటరీగా టేక్మాల్ జైహింద్ రెడ్డి, కోశాధికారిగా వెన్నవెల్లి మహిపాల్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. సలహాదారులుగా వెన్నవెల్లి సత్తిరెడ్డి, టేక్మాల్ వెంకటరెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా చిట్కుల వెంకట్ రెడ్డి, వెన్నవెల్లి కిష్టారెడ్డి, కార్యవర్గ సభ్యులుగా పోలీస్ వెంకట్ రెడ్డి, వంగల శ్రీనివాసరెడ్డి, తీగుళ్ల మోహన్ రెడ్డి ఎన్నుకోబడ్డారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ టేక్మాల్ వెంకట్ రెడ్డి, రెడ్డి సంఘం సభ్యులు పాల్గొన్నారు. పేద రెడ్డిల అభివృద్ధి కోసం సంఘం ఐక్యవేదికగా ముందుకు సాగనుంది.

## చెరువు పరిరక్షణపై కలెక్టర్‌కి ఫిర్యాదు



**పెద్దపల్లి, మే 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పెద్దపల్లి మండలం పెద్దకాల్వల గ్రామంలోని భోజన్న చెరువు కట్టకు గుర్తు తెలియని వ్యక్తులు గండి పెట్టిన ఘటనపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కి టిఆర్పి పార్టీ నాయకుడు గుండవేన స్వామి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువుకు ఉద్దేశపూర్వకంగా గండి పెట్టడం వల్ల నీరు వృథాగా పోయే ప్రమాదం ఏర్పడిందని, చెరువు కింద ఉన్న వరి పంటలకు, పశువులకు, చేపలకు తీవ్ర నష్టం కలిగే పరిస్థితి నెలకొన్నదని తెలిపారు. చెరువు కట్టకు గండి పెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే, సంబంధిత అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో బత్తుల అనిల్, బత్తుల కొమురయ్య, నామసాని ఐలయ్య, బత్తుల రవి, గాండ్ల అంజయ్య, జంగిటి కొమురయ్య, అదిచెర్ల మూర్తి, సలేంద్ర మహేష్ కుమార్, నంసాని పెద్ద ఐలయ్య, మణిదీప్ రైతులు తదితరులు పాల్గొన్నారు. చెరువుకు గండి పెట్టిన వారిపై తక్షణ చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

## రన్‌వేపై ఉన్న వ్యక్తిని ఇంజిన్‌లోకి లాక్కున్న విమానం..!

**న్యూఢిల్లీ మే 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కంచె దాటి ఎయిర్‌పోర్టులోకి వచ్చిన ఓ వ్యక్తి రన్‌వే దాటుతుండగా.. ఓ భారీ ఎయిర్‌బస్ ఏ-321 విమానం అతడిని ఇంజిన్‌లోకి లాగేసుకుంది. అమెరికా లోని కొలరాడో లో ఈ ఘటన చోటుచేసుకొంది. స్థానిక డెన్వర్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు లో ఫ్రాంటియర్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం టేకాఫ్ అయ్యే సమయంలో ఓ వ్యక్తి హఠాత్తుగా కంచె దూకి రన్‌వేకు అత్యంత సమీపంలోకి వచ్చాడు. దాంతో అతడిని విమానం ఇంజిన్ ఒక్కసారిగా లోపలకు లాగేసుకోవడంతో ప్రాణాలు కోల్పోయాడు. అతడి శరీరం పైభాగం ఇంజిన్‌లో ఇరుక్కుపోయింది. ఇంజిన్ నుంచి భారీగా మంటలు వెలువడ్డాయి. ఈ ప్రమాదం జరిగిన సమయంలో విమానం గంటకు 139 మైళ్ల వేగంతో ప్రయాణిస్తోంది. విమానం లోపల కూర్చున్న ప్రయాణికులకు ఇంజిన్‌లో నుంచి మనిషి కాళ్లు కనిపించడంతో ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. ఇంజిన్ నుంచి భారీ శబ్దాలు వినిపించడంతోపాటు మంటలు వెలువడ్డాయి. దాంతో విమానం టేకాఫ్‌ను నిలిపేసి ప్రయాణికులు, సిబ్బందిని సురక్షితంగా కిందకు దించేశారు.

## ఉపాధి హామీ పనులకు శ్రీకారం చుట్టిన సర్పంచ్ పండుగ శ్రీకాంత్



**హుస్నాబాద్ , మే 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కోహెడ మండలం వెంకటేశ్వర్లపల్లి గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద పెద్దగుట్ట పీటి పీడర్ ఛానల్ పూడిక తీత పనులను గ్రామ సర్పంచ్ పండుగ శ్రీకాంత్ భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకుని పనులకు హాజరై ఆర్థిక లాభం పొందాలని కోరారు. గ్రామాభివృద్ధికి తోడ్పడే ఈ పనులు సమర్థవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డ్ సభ్యుడు గాజుల అనంత్, ఫీల్డ్ అసిస్టెంట్ జక్కుల సౌభాగ్య, గ్రామ ప్రజలు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు. గ్రామాభివృద్ధి కోసం ఉపాధి హామీ పనులు వేగంగా సాగాలని సర్పంచ్ పండుగ శ్రీకాంత్ ఆకాంక్షించారు.

## విద్యా వారోత్సవాలలో భాగంగా సైన్స్, కంప్యూటర్ ల్యాబ్‌ల ప్రారంభం



**హుస్నాబాద్ , మే 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాల సందర్భంగా చిగురుమామిడి మండలం ముల్కనూర్ గ్రామంలో విద్యార్థులకు ఆధునిక విద్యా సదుపాయాలు అందించే దిశగా రెండు నూతన ల్యాబ్ గదులను ప్రారంభించారు. ఈజీఎస్ నిధులతో రూ.13.50 లక్షల వ్యయంతో నిర్మించిన సైన్స్ ల్యాబ్ గదిని జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాలలో, పీఎంసీ నిధులతో రూ.14.50 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్ గదిని ప్రైమరీ స్కూల్‌లో గ్రామపంచాయతీ సర్పంచ్ సాంబారి భారతమ్మ కొమురయ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ జయప్రద, జడ్.పి.హెచ్.ఎస్ హెచ్‌ఎం శోభారాణి, ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం శారద, వార్డు సభ్యులు పిట్టల తిరుపతి, మహమ్మద్ రజాక్, ఉపాధ్యాయులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు. సర్పంచ్ సాంబారి భారతమ్మ కొమురయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు కూడా ప్రైవేట్ స్థాయి సదుపాయాలు అందాలని, సైన్స్--టెక్నాలజీ రంగాల్లో రాణించేందుకు ఈ ల్యాబ్‌లు ఎంతో దోహదపడతాయని తెలిపారు. గ్రామాభివృద్ధితో పాటు విద్యాభివృద్ధికి కూడా ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ముల్కనూర్‌లో విద్యార్థుల భవిష్యత్తు కోసం ఆధునిక ల్యాబ్‌లు కొత్త అవకాశాలను తెరుస్తున్నాయి.

